నేటి దినపత్రిక

సూర్య

www.suryaa.com

చిత్తూరు తిరుపతి

గురువారం 26 ఫిబ్రవరి 2026

పేజీలు 11

అభివృద్ధికి ఆమడదూరంలో

కుటాళవంక

- పంచాయతీ నిర్లక్ష్యం మౌళిక వసతుల మృగ్యం..
- నెలలు గడుస్తున్నా శుభ్రం చేయని వాటర్ ట్యాంకులు..
- కలుషిత నీటినే పాఠశాలకూ సరఫరా
- పాఠశాలలో పనిచేయని వాటర్‌ఫిల్టర్
- విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం
- కాలువలు లేక ఇళ్ల మధ్యే మురుగునీరు
- పగటిపూటే వెలుగుతున్న వీధిదీపాలు

బైరెడ్డిపల్లి, మేజర్‌న్యూస్: మండలంని దేవదొడ్డి పంచాయతీ కూటళవంక గ్రామం సమస్యలతో సతమతమవుతున్నది. గత వంద సంవత్సరాల నుండి ఈ ప్రదేశంలో నివసిస్తున్న (ఇర్ల) కులానికి చెందిన 32 కుటుంబాల వారు ఇక్కడ నివసిస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని వీరు కూలీలకు వెళ్లి సంపాదించుకోవడమే జీవనాధారం. వర్షాభావ ప్రదేశం కాబట్టి సేద్యలు కూడా అంతంత మాత్రమే ఉంటాయి .ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందానా వీళ్ళు జీవిత విధానం ఈ గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉన్నది. ఈ స్కూలు సమస్యలతో సరైన సౌకర్యాలు సతమత మౌతోన్నది త్రాగడానికి నీటికొరకు ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి వాటర్ ప్యూరిఫైయర్ అనేక రోజుల నుండి పనిచేయడం లేదు. ఈ గ్రామానికి చెందిన వాటర్ ట్యాంకు శుభ్రపరిచి ఎన్ని రోజులు అవుతుందో తెలియదంటున్న గ్రామస్తులు. ఆ ట్యాంకు ద్వారా వచ్చేటటువంటి నీళ్లనే తాగుతున్న విద్యార్థులు. మురికి నీరు వెళ్లడానికి ఇప్పటివరకు డ్రైనేజీ సౌకర్యం లేదు. ఇళ్లల్లో మురుగునీరు ఎటు వైపుకు వెళ్లాలో అర్థంకాక వీరు సతమతమవుతున్నారు. కరెంటు స్తంభాలకు కరెంటు లైట్లు ఆర్పే విధానం లేదని, ఎప్పుడూ లైట్లు వెలుగుతూనే ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. నీళ్లు నిండిన తర్వాత ఓవర్ ఫ్లో వలన వాటర్ ట్యాంకు పై నుండి కిందకు నీరు పొంగి వస్తున్నదని, దాలి వలన పరిసర ప్రాంతాలు మొత్తం నీటితో

మిగతా 5లో..

గ్రహణం సందర్భంగా మార్చి 3న టిటిడి అన్నప్రసాద కేంద్రాల మూసివేత

తిరుపతి బ్యూరో మేజర్ న్యూస్: మార్చి 3వ తేదీ మంగళవారం రోజున చంద్రగ్రహణం సందర్భంగా తిరుపతి తిరుచానూరులోని తిరుమల తిరుపతి దేవస్థానాలు (టిటిడి) ఆధ్వర్యంలోని అన్నప్రసాద వితరణ కేంద్రాలను మూసివేయనున్నారు. ఇందులో భాగంగా తిరుచానూరులోని తోళ్లప్ప గార్డెన్స్‌లో గల ఎస్వీ నిత్య అన్నప్రసాద భవనం, తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని ఉద్యోగుల క్యాంటీన్, శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలోని క్యాంటీన్, అలాగే శ్రీనివాసం విష్ణు నివాసం వసతి సముదాయాల్లో భక్తులకు అందించే ఉచిత అన్నప్రసాద వితరణను తాత్కాలికంగా నిలిపివేస్తారు. అదేవిధంగా తిరుపతిలోని ప్రభుత్వ వైద్యశాలలు వివిధ ప్రథమ చికిత్స కేంద్రాల్లో రోగులు వారి సంరక్షకులకు అందించే అన్నప్రసాదాలను ముందస్తుగా పంపిణీ చేయనున్నారు.

4 లో

తిరుమలలో శ్రీవారి ధర్మరథాలకు విశేష ఆదరణ

ఆంగ్ల పేపర్-1 పరీక్షకు 30,571 హాజరు

తిరుపతిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీఎల్ సుబ్బారాయుడు

4లో..

5 లో

ఇక మిగిలింది మూడు రోజులే..

రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలి

జిల్లాలో వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా పొందాలని ప్రభుత్వ ఉత్తర్వులు. ఈ నేపథ్యంలో జిల్లాలో 255609 మంది రైతులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు సుమారు రెండు లక్షల పైగా రైతులు నమోదు చేసుకున్నారు. ఇక మిగిలిన రైతులు నమోదు చేసుకోవాల్సి ఉంది. ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై పీఎం, సీఎం కిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట నష్టపు పరిహారం, పంటల బీమా, సూక్ష్మ పోషకాల పంపిణీ, విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలు వంటి పలు ప్రభుత్వ పథకాలకు రైతు విశిష్ట సంఖ్యను కచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని వ్యవసాయ శాఖ చెబుతోంది. ఇతర వ్యవసాయ పథకాలకు ఈ విశిష్ట సంఖ్య అనుసంధానం చేస్తారు. రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ సమన్వయం చేసుకొని ఈ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ఇతర కారణాల చేత ఆయా గ్రామాల్లో అందుబాటులేని పక్షంలో రైతులు సెల్ఫోన్ ద్వారా రిజిస్టర్ చేసుకునే వె సులుబాటును ప్రభుత్వం కల్పించింది.

పర్యావరణం మానవ మనుగడకు దివిటీ

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ పర్యావరణం మానవ మనుగుడుకు దివిటీ లాంటిదని, దాన్ని భౌగోళం శాస్త్రం అన్ని విధాల అధ్యయనం చేస్తుందని ఎస్వియూ రెక్టర్ ఆచార్య అప్పారావు పేర్కొన్నారు. ఎస్వియూ భూగోళశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 20వ అంతర్జాతీయ భౌగోళిక సమావేశం "సుస్థిర అభివృద్ధి, వికసిత్ భారత్ కోసం నీరు నేల వనరుల నిర్వహణలో జియోస్పేషియల్ టెక్నాలజీస్" అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. సెనేట్ హాల్లో ముగింపు బుధవారం సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నీటి కొరత, నేల క్షీణత, వాతావరణ మార్పు, స్థిరమైన వనరుల నిర్వహణ వంటి సమకాలీన సవాళ్లను పరిష్కరించడంలో జియోస్పేషియల్ టెక్నాలజీల పెరుగుతున్న ప్రాముఖ్యతను వివరించారు. భౌగోళిక విద్య అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలతో అభివృద్ధి చెందాలని, భౌగోళిక పాఠ్యాంశాల్లో కృత్రిమ మేధస్సును అనువర్తింప చేయాలని, ప్రపంచ పోటీతత్వంతో సాగి, 3డి మ్యాపింగ్, స్పేషియల్ మోడలింగ్, ప్రిడిక్టివ్ అనలిటిక్స్, ఉపగ్రహ డేటా వివరణలో విద్యార్థులను సన్నద్ధం చేయాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. డిజిఎస్ఐ అధ్యక్షుడు ఆచార్య దీపేంద్ర నాథ్ దాస్ మాట్లాడుతూ సదస్సు మంచి ఫలితాలను ఇచ్చిందని, అనేక భూగోళ సంబంధిత విషయాలు చర్చకు వచ్చాయని చెప్పారు. కార్యదర్శి ఆచార్య బి.సి. వైద్య మాట్లాడుతూ యువ శాస్త్రవేత్తలు అధిక సంఖ్యలో సదస్సులో పాల్గొన్నడం ఆనందంగా వుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కాన్ఫరెన్స్ కన్వీనర్ సిడిసి డీన్ ఆచార్య ఎన్.చంద్రాయుడు, సమావేశంలో 162 పత్రాలు వచ్చాయని, 16॥రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారని, నేపాల్ నుంచి కూడా ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశోధనా పండితులు పాల్గొన్నారు.

ఎస్.డి.ఎస్.మూర్తికి ఘన నివాళి

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ ఎస్వియు బయోకెమిస్ట్రీ విభాగం ఆచార్య ఎస్.దుర్గా శ్రీనివాస మూర్తి ఆకస్మికంగా మృతి చెందారు. ఈ మేరకు బుధవారం బయో కెమిస్ట్రీ విభాగం అధ్యక్షులు ఆచార్య ఓవియస్.రెడ్డి అధ్యక్షతన సంతపు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్వియూ రెక్టార్ ఆచార్య అప్పారావు పాల్గొని ఆచార్య ఎస్.దుర్గా శ్రీనివాస మూర్తి చిత్రమటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూర్తితో కలసి 1979-82 మధ్య సిల్వర్ జూబ్లీ కాలేజ్, కర్నూల్ లో చదువుకున్నానని, తాము ఇక్కడే పిజి బయోకెమిస్ట్రీ చదివి, 1989లో ఒకే శాఖలో ఉద్యోగంలో చేరామని, వారితో వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావుద్వేగానికి లోనయ్యారు. స్వర్గీయ మూర్తి లేని లోటు విభాగానికి, విశ్వవిద్యాలయానికి తీర్చలేనిదన్నారు. విభాగ ఆచార్యులు బాలాజీ, అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ శ్రీధర్ మూర్తి, డాక్టర్ పల్లవి, డాక్టర్ వెంకటస్వామి, ఉమామహేష్, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

స్విమ్స్‌లో పలు పోస్టులకు 3వ తేది నుంచి 6వ తేది వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్ : శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కమ్యూనిటీ మెడిసిన్ విభాగంలో ఎవల్యూషన్ ఆఫ్ క్యాన్సర్ అవేర్‌నెస్ మరియు స్క్రీనింగ్ ప్రోగ్రామ్- యాన్ ఇంప్లిమెంటేషన్ రీసెర్చ్ ఇన్ తిరుపతి డిస్ట్రిక్ట్, ఆంధ్రప్రదేశ్" అనే ఎం.ఆర్.సి ప్రాజెక్టులో తాత్కాలిక ప్రాతిపదికన పలు పోస్టుల కోసం మార్చి 3వ తేది నుంచి 6వ తేది వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు స్విమ్స్ రిజిస్ట్రార్ డా.అపర్ణ ఆర్ బిట్లా బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

రాష్ట్ర కమిటీలో జిల్లాకు కీలక పదవులు

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడ కార్యాలయంలో రెండు రోజులు పాటు జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి అక్బర్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, కమిటీ సభ్యులుగా పవిత్ర, వినోద్, తేజలను నియమిస్తూ కీలక పదవులను అవకాశం కల్పించినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఏకీకృత కుటుంబ సర్వేను వేగవంతం చేయాలి

వెదురుకుప్పం, మేజర్‌న్యూస్: మండలంలో ఏకీకృత కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని వెదురుకుప్పం ఎంపీడీవో ఎల్ పురుషోత్తం అన్నారు. వెదురుకుప్పం సచివాలయం పరిధిలో జరుగుతున్న ఏకీకృత కుటుంబ సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం వెదురుకుప్పం అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ జయసుధ, తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటు సమావేశాల్లో టెలికాం సంస్థల్ని ప్రశ్నించడం అభినందనీయం.. పైనేని మురళి

ఎస్ఆర్ పురం మేజర్ న్యూస్: గతవారం పార్లమెంట్ సమావేశాల్లో ఎంపి రాఘవ్ చద్దా టెలికాం సంస్థలని ప్రశ్నించిన తీరు అభినందనీయం ఎందుకంటే బ్యాలెన్స్ లేనప్పుడు అవుట్గోయింగ్ కాల్స్ ఆపడం సరైనదే! కానీ ఇన్కమింగ్ కాల్సు కూడా నిలిపివేయడం రీఛార్జ్ చేయలేదని పేద ప్రజల కనెక్షన్లు కట్ చేయడం అన్యాయం అని పార్లమెంట్లోరాఘవ్ చద్దా ప్రజల పక్షాన గళాన్ని వినిపించడం అభినందనీయమని మొబైల్ మరియు దాని రీఛార్జ్ ఇప్పుడు ప్రతి మనిషికి నిత్యవసర వస్తువుగా అయిందని మొబైల్ ఫోన్ ద్వారానే ప్రస్తుతం మరియు రాబోయే రోజుల్లో కూడా అన్ని కార్యకలాపాలు జరిగే పరిస్థితి వస్తున్నాయని అలాంటి సమయంలో ఇలాంటి వారు గళం విప్పకపోతే ప్రజలకు మరింత అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లుగా పైనేని మురళి అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్క నాయకుడు ఆలోచించి ప్రజలకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తి పట్టణంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

- తెలుగుదేశం పార్టీ మహిళా నేత బొజ్జల రిషిత రెడ్డి

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులల్లో ఉన్న శ్రీకాళహస్తి పట్టణంలో బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని నేడు నేరుగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. శ్రీకాళహస్తి పట్టణంలో 30 మందికి సుమారు 45 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు జి విజయకుమార్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్చి 02 నుండి 09వ తేదీ వరకు ఆన్ లైన్ లో వస్త్రాలు ఈ - వేలం

తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్ : తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలకు భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలు కొత్తవి/ఉపయోగించినవి / పాక్షికంగా దెబ్బతిన్నవి (287) లాట్ల ఆర్ట్ సిల్క్ చీరల, హాఫ్ సారీస్, సిల్క్ చీరలు ఆర్డినరీ చీరలు తేదీ 02.03.2026 నుండి 09.03.2026 తేదీ వరకు టిటిడి వారు ఆన్ లైన్ లో ఇ ఏ ఐడి నంబర్స్ 25597 నుండి 25602 25604 నుండి 25609 ద్వారా ఈ - వేలం వేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఈ - కొనుగోలు పోర్టల్ లో రిజిస్టర్ అయిన ఆసక్తి కల్గిన బిడ్డర్లు వస్త్రాల ఆన్ లైన్ వేలంలో పాల్గొనడానికి అర్హులు. ఇతర వివరాలకు స్థానిక జనరల్ మేనేజర్ (వేలములు) ఏఈవో (వేలములు), టిటిడి, హరేకృష్ణ మార్గ్, తిరుపతిలో https://konugolu.ap.gov.in www.tirumala.org లేదా 0877-2264429 / 9959988470 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించగలరు.

ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసమే సంజీవని

శాంతిపురం, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుప్పం నియోజక వర్గంలోని ప్రజల ఆరోగ్యము మెరుగుదలకై "సంజీవని" అనే నూతన ఆరోగ్య కార్యక్రమం ప్రారంభించబడినది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత సులభతరమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి రాగలదని ఎంపీడీఓ ఏపీఆర్.కుమార్ తెలిపారు. బుధవారం 30 సొన్నేగానిపల్లె గ్రామములో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీడీవో మాట్లాడుతూ ఈ కార్యక్రమము ద్వారా ప్రజల ఆరోగ్య స్థితిని గుర్తించడం, క్యూ లైనులో నిలబడే అవసరము లేక పోవడం, క్యూఆర్ కోడ్, మొబైల్ అప్లికేషన్, టోల్ ఫ్రీ నెంబర్ల ద్వారా వైద్యులతో సంప్రదింపులు జరపవచ్చని, అలాగే ప్రజల ఆరోగ్య రికార్డులు భద్రపరచడం, అవసరమైన వారికి చికిత్సలు అందించడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. ఈ సంజీవని కార్యక్రమ సేవలు మండలంలోని అన్ని ప్రాథమిక కేంద్రాలలో, కుప్పం ఏరియా ఆసుపత్రిలో, పిఈఎస్ మెడికల్ కాలేజీలో సేవలు అందుబాటులో వున్నదని, కావున సంజీవని ఆరోగ్య కార్యక్రమములపై ప్రజలకు అవగాహన పెంపొందించుటకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని. ఈ గ్రామ సభలలో ప్రజలు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఈశ్వరన్న పంచాయతీ కార్యదర్శి సుధాకర్, సర్పంచ్ పుష్పావతి మంజూనాథ్, వైద్యులు వంశీకృష్ణ పలువురు పాల్గొన్నారు.

మరియాఫిలిప్ డిబేట్ ఎమరాల్డ్స్ ప్రతిభ

-జాతీయస్థాయిలో గ్రాండ్ ఫినాలేకి అర్హత సాధించిన విద్యార్థులు

-అర్హత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపిన యాజమాన్యం

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్: మరియాఫిలిప్ ఫ్యూచర్ లీడర్ డిబేట్ పోటీలలో ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభతో అవార్డులు పొందారు. బెంగళూరు వేదికగా గ్జావియర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు తిరుపతిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు రమ్య, రాజ్వీ భవసర్ పాల్గొని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు విజేతలుగా నిలిచి ట్రోఫి, ప్రశంశాపత్రంతో పాటు 15 వేలు నగదు బహుమతిని సాధించి దక్షిణ భారత స్థాయిలో జరిగే గ్రాండ్ ఫినాలేకి అర్హత సాధించినట్లు కళాశాల సంచాలకులు విశ్వనాథ్ గిరిధర్ తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థినిలను వారు అభినందిం చారు. నాణ్యత విద్య ప్రమాణాలకు తమ కళాశాల నిదర్శనమని, ఎందుకు విద్యార్థులు సాధించిన రాష్ట్ర స్థాయి విజయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థి, విద్యార్థులను ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు. ఇంతటి విజయానికి కారణమైన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమములో ఉప సంచాలకు మునిరత్నం, ప్రిన్సిపల్ జాఫర్వల్లీ, భానుకిరణ్ పాల్గొన్నారు.

అరవపాలెం విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చిట్టమూరు మేజర్ న్యూస్: మండలం అరవపాలెంలోని శ్రీ సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి కళాశాలలోని ఇంటర్మీడియట్,పదో తరగతి విద్యార్థులకు శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాకవర్త్ పరిశ్రమ సహకారంతో పరీక్షా సామగ్రి పంపిణీ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ కు చెందిన 20 మందికి,పదో తరగతి చదువుతున్న 40 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు,జామెంట్రీ బాక్సులను రాకవర్త్ పరిశ్రమ అధినేత శ్రీరామ్ చేతుల మీదుగా అందజేశారు.కార్పొరేట్ సామాజిక బాధ్యతతో ప్రభుత్వ పాఠశాలలలో చదివే ప్రతి విద్యార్థికి విద్యావసతుల కల్పనే లక్ష్యంగా స్థానిక పరిశ్రమల భాగస్వామ్యంతో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపిన శ్రీ సిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి రాకవర్త్ పరిశ్రమ చొరవను అభినందించారు.పాఠశాల అభివృద్ధికి శ్రీసిటీ సహకారం నిరంతరంగా కొనసాగుతుందన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ శ్రీసిటీ ఫౌండేషన్ చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రశంసించిన ప్రధానోపాధ్యాయురాలు మంజుల అభివృద్ధికి సహకరిస్తున్న వారికి అభినందనలు,కృతజ్ఞతలు తెలిపినట్లు కూడా ప్రకటనలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాకవర్త్ సిబ్బంది,శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తంగేళ్లపాలెం పిఎసిఎస్ లో సంబరాలు

తొట్టంబేడు, మేజర్ న్యూస్: మండలం తంగళ్ళపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జిల్లా సహకార సంఘం ఉద్యోగులు కోసం రాష్ట్ర యూనియన్ తరపున ఉద్యోగులు యూనియన్ తరపున సుదీర్ఘ డిమాండ్ల కోసం పోరాడి సాధించిన తిరుపతి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పప్పు చిరంజీవిరెడ్డిని ఘనంగా ఆఫీసు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, శేఖర్ బాబు, వాసు, భాస్కర్, దివ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి

చిట్టమూరు మేజర్‌న్యూస్: సామాజిక అంశాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ నాగరాజు సూచించారు. జిల్లా ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ఆల్ఫా ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలోని బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చట్టాలు,సైబర్ నేరాలు,ట్రాఫిక్,వ్యసనాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణ, గంజాయి వల్ల కలిగే అనర్థాలు,ట్రాఫిక్ నియ మాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు,హెల్మెట్,సీటుబెల్ట్ వాడకం ప్రాముఖ్యత,రోడ్లపై మొబైల్ వాడకం వల్ల జరిగే ప్రమాదాలు,రోడ్డు ప్రమాదాలు,అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.విద్యార్థుల్లో చిన్నప్పటి నుండే అవగాహన పెంపొందిస్తే, రాబోయే రోజుల్లో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవ చ్చునని పేర్కొన్న ఎస్ఐ నాగరాజు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని,సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉంటూ కెరీర్‌పై దృష్టిపెట్టాలని,ఈ కార్యక్రమం ద్వారా నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులకు,ఇంటి దగ్గర ఉన్న చుట్టుపక్కల వారికి వివరించి వారియర్స్ గా పని చేయాలన్నారు.

రాములు వారి కుంభాభిషేకంలో ఉన్నం వాసుదేవ నాయుడు దంపతులు

తొట్టంబేడు మేజర్‌న్యూస్: మండలంలోని తాటి పర్తి పంచాయతీ తాటిపర్తి హరిజనవాడలో శ్రీ శ్రీ రాములు వారి కుంభభిషేకం కార్యక్రమానికి గ్రామస్తులు ఆహ్వానం మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీ ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, సతీమణి మండల ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొని, అనంతరం వాసుదేవ నాయుడు దంపతులు, స్వామి వారి పూజలు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు, దర్శనం అనంతరం గ్రామస్తులు అష్ట ఆయురోగ్యాలతో సంతోషంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నారు, వారితోపాటు సర్పంచ్ నాగేంద్ర,తాటి పర్తి గ్రామస్తులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

చిట్టమూరు మేజర్ న్యూస్ : మండలంలోని అరవపాలెం శ్రీ సన్నారెడ్డి బాలకృష్ణారెడ్డి ఉన్నత పాఠశాలకు యల్లశిరికి చెందిన జూపల్లి సాత్విక్ పుట్టినరోజు సందర్భంగా మైక్ సెట్ ను వితరణ చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగే ప్రార్థన కార్యక్రమం,పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో మైక్ సెట్ లేక పోవడంతో విద్యార్థుల అవసరాలను గుర్తెరిగిన ఇక్కడ పని చేసి ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు ఈదురు వేణుగోపాల్ కుటుంబానికి చెందిన జూపల్లి సాత్విక్ (యూఎస్ఏ) పుట్టినరోజు సందర్భంగా తాత తోటపల్లి విజయ్ కుమార్ సహకారంతో పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మైక్ సెట్ ను విద్యార్థుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు మంజులకు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యా శాఖ అధికారులు బివి కృష్ణయ్య,బత్తల భూపయ్య,ఈదూరు నాగురయ్య నాయుడు,టి విజయ కుమార్ లు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పరిశ్రమలో ఏర్పాటుకు కృషి, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్: ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గం యువత ఉపాధి అంశంపై ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రసంగించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించబడుతున్న నేపథ్యంలో కంపెనీలలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టంగా డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ సహకారంతో శ్రీకాళహస్తిలో అనేక ఫ్యాక్టరీలు, కంపెనీలు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు వచ్చినప్పుడు మా యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి అధిక సంఖ్యలో ఉద్యోగాలు ఇవ్వాలి అని ఆయన చెప్పారు. స్థానికంగా యువకులకు ఎక్కువ ఉద్యోగాలు కల్పించేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వాన్ని కోరారు. పరిశ్రమలు వలన పెరుగుతున్న కాలుష్య సమస్యలపై కూడా ఎమ్మెల్యే ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యం కారణంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు సహా పలు ఆరోగ్య సమస్యలు అధికమవుతున్నాయని పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సిఎస్ఆర్ నిధులు వినియోగంపై పారదర్శకత అవసరమని కూడా ఆయన డిమాండ్ చేశారు. పరిశ్రమలు ఖర్చు చేస్తున్న సిఎస్ఆర్ ఫండ్స్‌ను ఏ అభివృద్ధి పనులకు వినియోగిస్తున్నారో ప్రజలకు తెలియజేయాలని కోరారు. శ్రీకాళహస్తి యువతకు అధిక ఉద్యోగ అవకాశాలు, కాలుష్య నియంత్రణ, పారదర్శక అభివృద్ధి కోసం అసెంబ్లీలో గళం విప్పిన బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ప్రసంగించారు.

కోమటిగుంటలో సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమ.. కాలుష్యంపై ప్రజాగ్రహం

- పరిశ్రమ మూసివేయాలంటూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో

సత్యవేడు, మేజర్ న్యూస్: సత్యవేడు పంచాయతీ పరిధిలోని కోమటి గుంటలో నడుస్తున్న సిమెంట్ ఇటుకల తయారీ పరిశ్రమ ద్వారా వెదజల్లుతున్న దుమ్ము ధూళి,రసాయన వ్యర్థాల కాలుష్యంపై ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది.కాలుష్యం నుంచి తమను కాపాడాలని కోరుతూ బుధవారం కోమటిగుంట వాసులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా కోమటి గుంట వాసులు మాట్లాడుతూ సత్యవేడు పట్టణం కోమటికుంట వద్ద పట్టణానికి చెందిన ఒక బడా వ్యక్తి సిమెంట్ ఇటుక పరిశ్రమను నిర్వహిస్తున్నారన్నారు.ఈ నేపథ్యంలో సిమెంట్ ఇటుక తయారీ ముసుగులో తమిళనాడులోని గుమ్మడిపూడి,చెన్నై ప్రాంతాల్లోని ఇనుము,పవర్ ప్లాంట్ పరిశ్రమల నుంచి ఇనుముతో కూడిన రసాయన వ్యర్థపదార్థాలను ఇక్కడికి తీసుకొచ్చి భారీగా డంప్ చేసుకున్నట్టు చెప్పారు.రసాయనతో కూడిన ఈ వ్యర్థపదార్థాలను క్రషింగ్ మిషన్లలో వేసి మెత్తని పొడిగా తయారుచేస్తున్నారు. ఇలా తయారైన మెత్తని పొడిని ఉపయోగించి సిమెంటు ఇటుకలను తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు.ఈ కారణంగా కాలనీవాసులు పలువురు ఇప్పటికే ఊపిరితిత్తులు, శ్వాస కోస,కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురై ఆస్పత్రిలో చుట్టూ తిరుగుతున్నామని వారు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కాలుష్యానికి కారణం అవుతున్న వైష్ణవి బ్రిక్స్ యాజమాన్యశీపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో కోమటిగుంట వాసులు సెల్వం, డేవిడ్, రమేష్ బాబు, నాగరాజు, రాబిన్,కిషోర్ బాబు, మదన్, లక్ష్మీ, రమ, రజిని తదితరులు పాల్గొన్నారు.

అల్లనేరేడు తోటలో అగ్నిప్రమాదం

పుంగనూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని పట్రపల్లి గ్రామ సమీపంలోని అల్ల నేరేడు తోటలో అగ్నిప్రమాదం జరుగుతున్నదని బుధవారం సమాచారం అందడంతో ఫైర్ ఆఫీసర్ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేసామని ఒక ప్రకటనలో తెలిపారు. అగ్ని ప్రమాదంలో నెల్లి, అల్లనేరేడు, డ్రిప్పు పైపులు, కేబుల్ అగ్ని ప్రమాదానికి గురైందని దాదాపుగా వీటి విలువ లక్ష 50 వేల వరకు ఉంటుందని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం తాగి ఆర్పకుండా పారవేసిన ముక్కల వల్ల ఈ అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చునని అన్నారు.

సముద్రంలో అక్రమ రవాణా చేస్తే చర్యలు

వాకాడు, మేజర్‌న్యూస్ : ఇతర దేశాల, రాష్ట్రాలు బోట్లు సముద్రంలో అక్రమ రవాణా చేస్తే మత్స్యకారులు వెంటనే సమాచారం తెలియజేయాలని మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ సౌమ్య అన్నారు. బుధవారం మండలంలోని కొండూరు పాలెం తుఫాన్ షెల్టర్ లో మత్స్యకార కాపులు, కొండూరు పాలెం మత్స్యకార గ్రామస్తులతో సముద్ర భద్రతపై మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెరైన్ సబ్ ఇన్స్పెక్టర్ సౌమ్య మాట్లాడుతూ కొండూరు పాలెం, దుగ్గరాజుపట్నం, లైట్ హౌస్, సముద్రంలో బోటు షికారు నిషేధమని, షర్ట్ విరుద్ధంగా బోటు షికారు చేసిన మనుషులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు, సముద్రంలో అనుమానస్పదంగా మనుషులు కనిపించిన ఈ ప్రాంతంలో నివసించే మత్స్యకారులు వెంటనే మెరైన్ పోలీస్ స్టేషన్ కు సమాచారమేవ్వాలని ఆమె తెలిపారు, ముక్యంగా ఈ ప్రాంతంలో మత్స్యకారులు సముద్రంలో జోనోపాధి మీద ఆధారపడి ఉంటారని, ఎప్పటికప్పుడు మత్స్యకారులు కూడా పర్యవేక్షణలో ఉండాలని ఆమె కోరారు.

రాములు వారి కుంబాభిషేకంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ

తొట్టంబేడు, మేజర్ న్యూస్: మండలంలోని తాటిపర్తి పంచాయతీ తాటిపర్తి ఎస్సీ కాలనీలో శ్రీ శ్రీ శ్రీ రాములు వారి కుంభాభిషేకానికి గ్రామస్తులు ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే ఎస్సివి నాయుడు హాజరయ్యారు. తాటిపర్తి గ్రామస్తులు శ్రీశ్రీ రామ వారి ఆలయ కుంభాభిషేకం కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు శోభన నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్చి 2 న గురుకులంలో ప్రవేశ పరీక్షలు

వాకాడు,మేజర్ న్యూస్ : మార్చి నెల రెండవ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాల వాకాడులోని 5వ తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ తెలిపారు. బుధవారం ఒక్కడు గురుకులంలోని ఆయన స్థానిక విలేకరులకు ప్రకటన ద్వారా తెలియజేస్తూ ఆరు నుండి పదవ తరగతి వరకు జరిగే ప్రవేశ పరీక్షలకు మార్చ్ 8వ తేదీ జరుగుతాయని అన్నారు, విద్యార్థిని విద్యార్థులు ఎక్కడ దరఖాస్తులు చేసుకున్నారో ఆ గురుకుల లోనే ఐదు తరగతి, మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతాయని, మీ ఊరు ప్రవేశ పరీక్షలు జరిగే కంట ముందే హాజరుకావాలని ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ కోరారు.

కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకోండి

అధికారులకు ఎంపీ గురుమూర్తి ఆదేశాలు

తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్: రాష్ట్రంలో కల్తీ పాల అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో తిరుపతి లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఆహార భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. తిరుపతి జిల్లాలో ఎక్కడైనా కల్తీ పాలు లేదా కల్తీఆహార పదార్థాల విక్రయం జరుగుతుందనే అనుమానం ఉన్న ప్రాంతాల్లో వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాల సేకరణ కేంద్రాలు, డెయిరీలు, హోటళ్లు, స్వీట్లు తయారు చేసే దుకాణాలు, టీ స్టాళ్లు వంటి ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి నమూనాలు సేకరించాలని సూచించారు. ల్యాబ్ పరీక్షల ద్వారా పాల నాణ్యతను నిర్ధారించి, కల్తీ నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దని కోరారు. అదేవిధంగా, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌కి లేఖ రాశారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. అవసరమైతే టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు చేయాలని అభిప్రాయపడ్డారు. ఒకటికి మించి నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేసే చర్యలు కూడా తీసుకోవాలని కోరారు. ప్రజలకు కూడా ఆయన కొన్ని సూచనలు చేశారు. పాలు కొనుగోలు చేసే సమయంలో నాణ్యతపై శ్రద్ధ వహించాలని, అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. తక్కువ ధరకు లభిస్తున్న పేరు లేని పాల ఉత్పత్తులను కొనుగోలు చేయడంలో జాగ్రత్త వహించాలని చెప్పారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా పాలు, పాల పదార్థాలు తీసుకుంటారని, వారి ఆరోగ్యాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ ఉండదని ఎంపీ మద్దిల గురుమూర్తి స్పష్టం చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లా యంత్రాంగం కటుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఈ లేఖలో ఎంపీ కోరారు.

ఇంటి నుంచి పారిపోయిన బాలుడు తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగింత

తిరుమల, మేజర్‌న్యూస్: ఇంటి నుంచి పారిపోయిన బాలుడిని అలిపిరి చెక్‌పాయింట్ వద్ద

టీటీడీ భద్రతా సిబ్బంది గుర్తించి, తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం గట్‌కేసరికి చెందిన లావేటి రఘునందన్, మానస దంపతుల కుమారుడు లావేటి సుజిత్ కుమార్ ఫిబ్రవరి 14న ఇంటి నుంచి పారిపోయి తిరుపతికి చేరుకున్నాడు. అలిపిరి చెక్‌పాయింట్ వద్ద మంగళవారం అనుమానాస్పదంగా ఉన్న బాలుడిని గమనించిన టీటీడీ భద్రతా సిబ్బంది వెంటనే అతని వివరాలను సేకరించి, తల్లిదండ్రులను సంప్రదించి సమాచారం అందించారు. అనంతరం బుధవారం బాలుడిని వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. తమ కుమారుడు క్షేమంగా దొరకడంతో కుటుంబ సభ్యులు టీటీడీ అధికారులకు, భద్రతా సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలసిన బీఎన్‌కండ్రిగ యువ నాయకుడు శివ

బిఎన్.కండ్రిగ, మేజర్‌న్యూస్: సత్యవేడు నియోజకవర్గంలోని బి.యన్ కండ్రిగ మండలానికి చెందిన యువ నాయకుడు కత్తి శివ వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని పులివెందులలో తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను తెలియజేశారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై కార్యకర్తలతో కలిసికట్టుగా పోరాడుతామని పార్టీ ఆదేశాల మేరకు ముందుకు కొనసాగుతామని తెలియజేశారు.

ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు 30,571 హాజరు

పరీక్ష కేంద్రాలలో పోలీస్ అధికారులు సిబ్బందికి పలు కీలక సూచనలు

ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు భద్రత కల్పించాలి

తిరుపతిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీఎల్ సుబ్బారాయుడు

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: జిల్లాలో జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు 30,571 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లావ్యాప్తంగా 84జనరల్, 14 ఒకేషనల్ కేంద్రాలలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంగ్లీష్ పేపర్-1 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు జనరల్ 29,974 మంది, ఒకేషనల్ విభాగంలో 1,383 మంది మొత్తం 331,357మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా జనరల్ విభాగంలో 686మంది, ఒకేషనల్ విభాగంలో 100మంది మొత్తం 786 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని ఆర్ఐఓ తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన తాగునీటి వసతి, పోలీసులు బందోబస్తు, మెడికల్ క్యాంపు, సీసీ కెమెరాలతో పరిరక్షణతో పాటు విద్యార్థులకు రవాణా బస్సు సౌకర్యాన్ని కల్పించారు. ఆర్ఐఓ జి.రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలుగా ఏర్పాటు చేసి పరీక్ష

కేంద్రాలను తనిఖీలు చేపట్టి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ... తిరుపతి కేంద్రంలో బుధవారం పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు స్వయంగా పరిశీలించారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాల, ఎమరాల్డ్స్ కళాశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించి విధుల్లో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా జరిగేందుకు స్పష్టమైన ఆదేశాలతో పాటు పలు కీలక సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులుసంచారంపై ప్రత్యేక ఉంచాలన్నారు. పరీక్షలు సమయంలో విద్యార్థులకు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన వాతావరణ కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 100 మీటర్లు పరిధిలో అమల్లోని నిషేధాజ్ఞలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. నిబంధన అతిక్రమించిన పక్షంలో సంబంధిత దుకాణదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాలో అపోహాలు తప్పుడు ప్రచారం ప్రశ్న ప్రతాలపై అసత్యవార్తలు వ్యాప్తి చెందకుండా సైబర్ విభాగం నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అవాంఛనీయ సంఘటన జరిగిన పక్షంలో వెంటనే ఉన్నత అధికారులకు సమాచారం అందజేసి తగుచర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు భయాందోళన వీడి పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఆకాంక్షిస్తూ, తల్లిదండ్రులు ప్రజలు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుమలలో శ్రీవారి ధర్మరథాలకు విశేష ఆదరణ

బస్టాప్‌లలో డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుతో ఉచిత బస్సు సేవలకు కొత్త ఊపు

రోజుకు 60 వేల మంది భక్తులు ఉచిత బస్సుల్లో ప్రయాణం

ఇంధన వినియోగం తగ్గడంతో పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు

తిరుమల, మేజర్‌న్యూస్: తిరుమలలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ నిర్వహిస్తున్న శ్రీవారి ధర్మ రథాలు (ఉచిత బస్సు సేవలు) డిజిటల్ డిస్ప్లే బోర్డుల ఏర్పాటుతో మరింత ప్రజాదరణ పొందుతున్నాయి. బస్సులు వచ్చే సమయాన్ని భక్తులు ముందుగానే తెలుసుకునేలా డిజిటల్ డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయడం వల్ల వేచిచూసే సమయం తగ్గి, ఉచిత రవాణా సేవలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో మొత్తం 12 ఆధునిక ఎలక్ట్రిక్ బస్సులు ఈ సేవలో ఉన్నాయి. రోజుకు సగటున 300 ట్రిప్పులు నిర్వహిస్తూ, ఒక్కో ట్రిప్పు సుమారు 6.5 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తోంది. ఈ విధానం దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోసం ప్రత్యక్ష బస్సు సమాచారం అందించే తొలి సాంకేతిక ప్రయోగంగా నిలుస్తోంది.

రోజుకు 60వేల మంది భక్తులు సురక్షితంగా ప్రయాణం

బస్సుల ప్రత్యక్ష స్థానం, వచ్చే సమయాన్ని డిజిటల్ డిస్ప్లే ద్వారా భక్తులకు తెలియజేయడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోజుకు సుమారు 60 వేల మంది భక్తులు ఈ ఉచిత బస్సు సేవలను వినియోగిస్తూ సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు.

తగ్గిన ప్రైవేట్ ట్యాక్సీల ప్రయాణం - పెరిగిన ప్రజా రవాణా వినియోగం

గతంలో ఉచిత బస్సు వచ్చే సమయం ముందుగా తెలియకపోవడంతో భక్తులు ప్రైవేట్ ట్యాక్సీల్లో ప్రయాణించేందుకు మొగ్గు చూపేవారు. దీంతో ట్యాక్సీ డ్రైవర్లు భక్తుల నుండి అధిక ధరలను వసూలు చేసేవారు. ఈ సమస్యను గుర్తించిన టీటీడీ అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్యచౌదరి ప్రత్యేక చొరవ తీసుకుని తిరుమలలోని 20 బస్టాప్‌లలో బస్సుల ప్రత్యక్షసమయం తెలిసేలా డిజిటల్‌డిస్ప్లే బోర్డులఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను హైదరాబాద్‌కు చెందిన బి.ఎస్.టెక్నోట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డిజిటల్ బోర్డులను విరాళంగా అందివ్వగా, ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ సంస్థ సాంకేతిక సహకారం అందిస్తోంది. ఈ విధానం అమలు చేసినప్పటి నుండి బస్టాప్ వద్దకు వచ్చిన భక్తులకు బస్సు వచ్చే సమయం ప్రత్యక్షంగా తెలియడం, 10 నిమిషాల లోపే బస్సులు రావడంతో భక్తులు ఉచిత బస్సు సేవలను విరివిగా వినియోగించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ సౌకర్యం ఎంతో ఉపయోగరంగా ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంధన వినియోగం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణ తోడ్పాటు... ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం ద్వారా ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్య నియంత్రణకు కూడా ఈ సౌకర్యం దోహదపడుతోంది. అదేవిధంగా తిరుమలలో వాహనరద్దీని తగ్గించి కాలుష్య నియంత్రణ దిశగా పటిష్టమైన ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి, భక్తులకు సౌకర్యవంతమైన, పర్యావరణ హితమైన రవాణా అందించాలనే లక్ష్యంతో టీటీడీ ఈ విధానాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది.

భక్తుల కోసం రాత్రుల్లో అదనంగా 20 ట్రిప్పులు

ప్రస్తుతం రాత్రి 9 నుండి ఉదయం 5 ఐదు గంటల వరకు ఈ ఎలక్ట్రిక్ బస్సులు 60 ట్రిప్పులు తిరుగుతుండగా భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో 20 ట్రిప్పులను పెంచనున్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా అదనంగా మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మిగిలింది మూడు రోజులే..!

వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:

జిల్లాలో వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్య పొందాలి. విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలి. దీనికి ఈ నెల ఆఖరి వరకు ప్రభుత్వం విధించిన గడువు ముగుస్తోంది. అంటే ఇక మిగిలింది మూడు రోజులే.

జిల్లా పరిస్థితి ఇది... జిల్లాలో వ్యవసాయ భూములు ఉన్న ప్రతి రైతు విశిష్ట సంఖ్యను తప్పనిసరిగా పొందాలని ప్రభుత్వ ఉత్తర్వులు. ఈ నేపథ్యంలో జిల్లాలో 255609 మంది రైతులు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు సుమారు రెండు లక్షల పైగా రైతులు నమోదు చేసుకున్నారు. ఇక మిగిలిన రైతులు నమోదు చేసుకోవాల్సి ఉంది.

ప్రయోజనాలు పొందాలంటే... ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా ప్రతి రైతు విశిష్ట సంఖ్యను పొందాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై పీఎం, సీఎంకిసాన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట నష్టపు పరిహారం, పంటల బీమా, సూక్ష్మపోషకాల పంపిణీ, విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలు వంటి పలు ప్రభుత్వ పథకాలకు రైతు విశిష్ట సంఖ్యను కచ్చితంగా పరిగణలోకి తీసుకుంటారని వ్యవసాయశాఖ చెబుతోంది. ఇతర వ్యవసాయ పథకాలకు ఈ విశిష్టసంఖ్య అనుసంధానం చేస్తారు. రెవెన్యూశాఖ, వ్యవసాయశాఖ సమన్వయం చేసుకొని ఈ ప్రక్రియను వేగవంతంగా కొనసాగిస్తున్నారు. ఆయా గ్రామాల్లో అందుబాటులేనిపక్షంలో రైతులు సెల్ఫోన్‌ద్వారా రిజిస్టర్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

నమోదు కోసం... ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యపొందాలన్నా నిబంధన నేపథ్యంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు కోసం రైతు సేవా కేంద్రాలు, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి నమోదు చేసుకోవాలి. లేదా రైతు స్వయంగా క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి ఆధార్ నెంబరుతో నమోదు చేసుకోవచ్చు. ఈ క్రమంలో పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్కు అనుసంధానమైన సెల్ఫోన్ నెంబర్ ఉండాలి. ప్రతి రైతుకు 11అంకెల గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారు. సంక్షేమ పథకాలు జీవనాడిగా ఈ విశిష్ట సంఖ్య పనిచేస్తుంది. ఇప్పటివరకు జిల్లాలో కుప్పం, వెంకటగిరి మండలాలు విశిష్ట సంఖ్య నమోదులో వెనుకంజలో ఉన్నట్లు సమాచారం. గంగవరం, యాదమరి మండలాలు విశిష్టసంఖ్య నమోదులో ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. రైతులు సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 155251కు సంప్రదించవచ్చు. వెదురుకుప్పం మండలంలో 8839 మంది రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాల్సి ఉంది. కాగా 7471 మంది రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మిగిలిన రైతులు గడువు లోపల నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులను హెచ్చరిస్తున్నారు.

ప్రతి రైతు విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

ప్రతి రైతు విశిష్ట సంఖ్యను నమోదు తప్పనిసరిగా చేపించుకోవాలని వ్యవసాయ అధికారిని వనిత కోరారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలకు విశిష్ట సంఖ్య ఎంతగానో తోడ్పడుతుంద న్నారు. రైతులు తమ సెల్ ఫోన్ ద్వారా క్యూఆర్ కోడ్ను స్కాన్ చేసి నమోదు చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. రైతులకు అనుమానాలు ఉంటే వ్యవసాయ అధికారిని సంప్రదిస్తే నివృత్తి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ నెల ఆఖరి వరకే గడువు ఉందని, రైతులు దీనిపై దృష్టి సారించి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

ఏఓ వనిత, వెదురుకుప్పం

అభివృద్ధికి నోచుకోని ఎస్టీల కూటాళవంక గ్రామం

(మొదటిపేజీ తరువాయి)

జలమాయమవుతున్నాయని, నీళ్లను ఆపేవారు లేరని, శుభ్రపరిచే వారు కూడా లేరని, ఇప్పటివరకు పంచాయతీ సెక్రెటరీని వారు చూడలేదని ఎద్దేవా చేశారు. సంబంధిత సెక్రటరీను వివరణ కోరగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ క్లీనింగ్ చేస్తున్నామని,అది ఎవరు చేస్తున్నారో చెప్పడానికి తట పటాయించారు,15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్ క్లీన్ చేయాల్సి ఉండగా ఆరు నెలలైనా ఇప్పటి వరకు నీటి ట్యాంకును క్లీన్ చేసిన దాఖలాలు లేవు,నీటి ట్యాంకు కింద ఉన్న పైపుల ద్వారా నీళ్లు కారుతతున్నాయి. వాటిని మరమ్మతు చేయాలని గ్రామస్తులు తెలపగా అంతపైకి వెళ్లి వెల్డింగ్ చేయడం కష్టమని కుదరదని సంబంధిత సెక్రటరీ తెలియజేశారు. ఈ గ్రామానికి చెందిన ఎస్టీ మహిళ గౌరమ్మ భర్త గణేష్ కరోనా సమయంలో చని పోవడం జరిగినది. అనేకసార్లు ఈమె వితంతు పెన్షన్ కోసం సంబంధిత అధికారులను కలిసినా ప్రయోజనం లేకపోవడంతో, జిల్లా స్థాయి అధికారులను కూడా ఆమె విన్నవించుకున్నది. అయినా కానీ ఇప్పటివరకు ఆమెకు వితంతు పెన్షన్ రాలేదు పెన్షన్ రాకపోవడంతో ఆ మహిళ నిరుత్సాహంతో ఉన్నారు. గౌరమ్మ భర్త డెత్ సర్టిఫికెట్ మాత్రం 2016లో మరణించినట్లు ఉన్నది. కరోనా వచ్చిన సమయం 2019 2021 మధ్యలో ఉండగా, అప్పుడు చనిపోయిన గణేష్ మృతికి గాను డెత్ సర్టిఫికెట్ 2016లో ఎలా నమోదు చేయడం జరిగినదో అర్థం కావడం లేదని మృతురాలి భార్య ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఇంకో వితంతు మహిళ ఉష అతని భర్త రఘు చనిపోవడం జరిగినది. అనేకసార్లు సంబంధిత సచివాలయాన్నికి వెళ్లి తెలియజేసినా, ఇంత వరకు పెన్షన్ సౌకర్యం కల్పించలేదని, ఎస్సీ ఎస్టీలకు భర్త చనిపోయిన వెంటనే పెన్షన్లు అప్లై చేసుకునే విధానాన్ని కల్పించాలని ఆమె తెలియజేశారు. చదువురాని తమకు ఇటువంటి సర్టిఫికెట్లను సంపాదించడం కష్టతరమని అనేక రోజులు కష్టపడితే తప్ప ఈ సర్టిఫికెట్లు రావని, వచ్చినా కానీ పెన్షన్లు రాకపోవడంతో నిరుత్సాహంగా ఉన్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నటువంటి ఈ గ్రామం సరైన సౌకర్యాలు లేక ఉండటంతో, ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న ఆ గ్రామ ఎస్టీ విద్యార్థులు మాట్లాడుతూ ఇటువంటి అసౌకర్యవంతమైన గ్రామం ఈ జిల్లాలోనే కాదు ఇంకెక్కడ లేదని, వెంటనే తమకు సౌకర్యాలను కల్పించాలని రాజ్యాంగంలో తమకు కల్పించాల్సిన రాయితీలను వెంటనే అందే విధంగా చూడాలని వారు తెలియజేస్తున్నారు.

ఎస్సీ నియోజకవర్గంలో కానరాని ఎస్ఐలు, సీఐల పోస్టింగులు

సూళ్లూరుపేట, మేజర్‌న్యూస్: రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన కులాల వారిగా అందరూ సమానంగా ఎదగాలన్న ఆలోచనతో దళితుల ఆరాధ్యదైవం డాక్టర్ బిఆర్ అంబేద్కర్, రిజర్వేషన్ల అనే చట్టాన్ని తీసుకు వచ్చిన ఘనత ఆయనకే దక్కింది. అందులో భాగంగానే సూళ్లూరుపేట నియోజక వర్గంలో దళితులు ఎక్కువ శాతం ఉండుతో ఎస్సి నియోజిక వర్గం చేసిన సంగతి తెలిసిందే. అంతే కాకుండా ఒక పార్లమెంట్ స్థానాన్ని కూడ కేటాయించారు. ప్రభుత్వాలు మారుతుంటాయి. నియోజికవర్గంలోని సూళ్లూరుపేటసర్కిల్, నాయుడుపేట సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సాధారణంగా ఒక ఎస్సై లేదా సిఐ విధులు నిర్వహిస్తుండటం సహజంగానే వస్తుంది. కాని గత ప్రభుత్వంలో ఎక్కువ సంవత్సరాలు పార్టీని అడ్డం పెట్టుకొని సుమారు 4 సం పేట సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా వెంకటేశ్వర్ల రెడ్డికే దక్కింది. ఎస్సి వర్గానికి చెందిన ఎస్సైలు బదిలీలు మాత్రం జరుగుతూనే ఉంటాయి. ఎందుకంటే వారికి ఉద్యోగం తప్ప వెనక సపోర్టు చాలా తక్కువే కాబట్టి కాని కూటమి పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సూళ్లూరుపేట సర్కిల్ పరిధిలో మాత్రం యస్సి కులానికి చెందిన ఒక్కరు అంటే ఒక్కరు కూడ కాన రావడం లేదని పేటలో ఎక్కడ చూసినా ఇవే మాటలు వినిపిస్తున్నాయి. యస్సి నియోజిక వర్గం అయినప్పటికి యస్సి కులానికి చెందిన కాని స్టెబుల్స్ తప్పా ఎస్ఐలు ' కనిపించపోవడంపై విమర్శలు బాగానే వినిపిస్తున్నాయి. పేటసర్కిల్ పరిధిలో సామాజికవర్గం తప్ప దళితవర్గానికి చెందిన ఒక్కరు కూడా లేకపోవడం విడ్డూరంగా ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏస్టేషన్‌లో చూసిన యస్సి, యస్టి కనిపించే అవకాశంలేదని దళితులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. ఇక పోతే నాయుడుపేట సర్కిల్ ఫరిదిలో ఉన్న సర్కిల్ ఇన్స్పెక్టర్ దళిత జాతికి చెందిన వ్యక్తి కావడంతో మింగుడు పడని అగ్రవర్ణాలకు చెందిన వారు ' సినిమా పక్కిలో ఏసిబి పట్టించి అతనిని కటకటాల్లోకి తోసేశారు. ఆయన స్థానంలో మరో వ్యక్తి అయినా సర్కిల్ ఇన్స్పెక్టర్ వస్తారని నాయుడు పేట ప్రజలు ఎదురు చూశారు. కాని దళితుల్లో ఎవరు లేరన్న రీతిలో అక్కడకూడ దళితులకు అన్యాయమే జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంలో దళితులకు న్యాయంచేయాలని నియోజకవర్గం ప్రజలు కోరుకొంటున్నారు.

ఒలింపియాడ్ పురస్కారం ప్రదానోత్సవం

ప్రాథమిక సబ్జెక్టులపై పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలు
సీఎండీ శివశంకర్ లోతేటి

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని వెలికి తీసేందుకు మాక్స్‌పీడ్ ఎడ్యుకేషన్ ఇండియా దక్షిణాంధ్ర మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్-2026 పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ లోతేటి పాల్గొని మాట్లాడుతూగణితం సైన్సు వంటి ప్రాథమిక సబ్జెక్టులపై పట్టు సాధిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. కేవలం పరీక్షల కోసమే కాకుండా, నిజ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి అనలిటికల్ థింకింగ్ అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, వారి కెరీర్ ప్రణాళికలపై కీలక సూచనలు చేశారు. మాక్స్‌పీడ్ ఎడ్యుకేషన్ ఇండియా సీఈఓ అశోక్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పట్టణ ప్రాంత విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించి, వారిని భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లుగా, సివిల్ సర్వెంట్లుగా తీర్చిదిద్దడమే తమ సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఈఒలింపియాడ్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, భవిష్యత్తులో మరిన్ని విద్యాసంబంధిత కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ వేడుక దక్షిణాంధ్ర విద్యా రంగంలో ఒక మైలురాయిగా నిలిచిందని పలువురు ప్రశంసించారు. అనంతరం ఒలంపియాడ్ పోటీలలో ఉత్తమ ప్రతిభచాటిన 64 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఇందులో దక్షిణాంధ్ర మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 32మంది, దక్షిణాంధ్ర సైన్స్ ఒలింపియాడ్‌లో 32 మంది విజేతలుగా నిలిచారు. 1 నుంచి 5వ ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులకు మెడల్స్, ట్రోఫీలు ప్రశంసా పత్రాలను అందజేశారు. విద్యార్థుల మధ్య నెలకొన్న పోటీ తత్వం, వారి అకడమిక్ ప్రతిభ ఈ వేడుకలో ప్రతిబింబించింది. ఈ వేడుకకు దక్షిణాంధ్రలోని ఆరు జిల్లాల నుండి విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాలల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించాలి

– ఏ జీ ఎం ఫణి కుమార్

చిత్తూరు ప్రతినిధి, మేజర్‌న్యూస్: విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకే సైన్స్ ఎగ్జిబిషన్, నెగిటివిటీ కాన్ఫరెన్స్ ఎంతగానో దోహదపడతాయని నారాయణ పాఠశాలల ఏజీఎం ఫణి కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కొంగారెడ్డిపల్లి నారాయణ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ సైన్స్ సంబంధించిన ప్రయోగాల నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఏకాంబరం విద్యార్థులు తయారుచేసిన నమూనాల వివరాలను తెలియజేయడంతో పాటు విద్యార్థులు సాధించిన మార్కుల వివరాలను తల్లిదండ్రులకు తెలియపరిచారు. ప్రస్తుతం సమాజానికి అనుగుణంగా విద్యార్థుల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎండి నీలిమ, ఆర్ ఐ జూలీఫా, కోఆర్డినేటర్ ఇలా రాణి, వైస్ ప్రిన్సిపాల్ షర్మిల, ఏవో ప్రసాద్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్ఐ

దొరవారిసత్రం, మేజర్ న్యూస్ : మండలంలో ఎవరైనా సరే అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని దొరవారిసత్రం ఎస్సై జీవి చౌదరి తెలిపారు. బుధవారం దొరవారిసత్రం పోలీస్ స్టేషన్ నందు మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు మీద ట్రాఫిక్ నియంత్రణ, గంజాయి రవాణా పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.చట్ట విరుద్ధ కార్యకలాపాలపై ప్రత్యేక నిగా పెట్టి నిర్లక్ష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా శ్రీ శక్తి యాప్ పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అత్యవసర సమయంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఈ యాప్ ను వినియోగించాలని సూచించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రిషిత రెడ్డి భూమి పూజ

శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్: శ్రీకాళహస్తి పట్టణం పలు వార్డులలొ తుడా నిధులు కోటి రూపాయలు వ్యయంతో ఎస్ డి కె నగర్, అగ్రహారం, హౌసింగ్ బోర్డు కాలనీలలొ సిసి రోడ్లు, డ్రైనేజీలకు, భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పనులను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి బొజ్జల రిషిత రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం

వెదురుకుప్పం, మేజర్‌న్యూస్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్ శివశంకరయ్య అధ్యక్షతన అవధాన కర్త "అవధాన ధ్యుతి" మల్లెల నాగరాజు అష్టావధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచంలో అనేక వేల భాషలు ఉన్నప్పటికీ అవధానము అనే ప్రక్రియ మన తెలుగు భాషలో మాత్రమే కనిపిస్తుందని ,ఆంధ్ర భాష అధికుల మన్ననలను పొందుతూ ఉన్నదని అవధాని తెలిపారు. కళలలో,ప్రక్రియలో అష్టావధానము అనునది అవధాని ఏకాగ్రత,విజ్ఞత, సమయస్ఫూర్తి,సాహిత్య పరిజ్ఞానం పై ఆధారపడి ఉంటుందని సంధాన కర్త హరివిల్లు వ్యవస్థాపకులు విద్వాన్ చలంకోట బురుజు మునస్వామి తెలిపారు. స్థానిక వైయస్సార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద అవధాన ప్రక్రియ చాలా ఆసక్తిదాయకమని, పిల్లలు శ్రద్ధగా ఆలకిస్తే అద్భుతాలు ఆవిష్కృతమవుతాయని తెలిపారు.నిషిద్ధాక్షరి శాంతా భాస్కర రెడ్డి , న్యస్థాక్షరి డాక్టర్ ఎద్దుల బాలకృష్ణారెడ్డి ,సమస్య డాక్టర్ ఎం పురుషోత్తమాచారి ,దత్తపతి విద్వాన్ ఎస్ చిన్న స్వామి రెడ్డి ,వర్ణన వైఎస్ కుప్పు స్వామి శర్మ ,పురాణ పఠనము పట్టు బాల జయచంద్రారెడ్డి , ఆశువు బండి సుజాతమ్మ,అప్రస్తుత ప్రసంగం డాక్టర్ బండి ప్రభాకర్ రెడ్డి పుచ్చకులు గా పాల్గొని సభా సదులను అలరించారు. పిల్లల కేరింతల మధ్య వారి ప్రశ్నలకు అవధాని మల్లెల నాగరాజు చాలా చమత్కారంగా జవాబులు చెప్పారు.ఈ కార్యక్రమంలో సాహితీ ప్రియులు బండి లక్ష్మమ్మ చంగల్రాయ రెడ్డి,సర్పాడి మునిరత్నం,పి కోదండ రెడ్డి,బండి గీత స్కూల్ అసిస్టెంట్ తెలుగు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బండి జగదీశ్వర రెడ్డి,సిద్ధయ్య,బండి ధనలక్ష్మి విశ్రాంతి ఆర్మీ పరమేశ్వర రెడ్డి స్కూల్ అసిస్టెంట్లు,నాగమణి,శ్రీనివాసులు అశోక్,ఆధ్యాత్మిక ప్రవచన కారులు భారతి,తదితరులు పాల్గొన్నారు.

చిన్న శేష వాహనంపై ఊరేగిన పాండురంగడు

పుంగనూరు, మేజర్ న్యూస్:

పట్టణంలో టీటీడీ పరిధిలోని కోనేటి వద్ద వెలిసిన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం లో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం మలయప్ప స్వామి చిన్న శేష వాహనంపై పాండురంగనిగా పురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శన భాగ్యాన్ని కలిగించారు.

జానకిరామిరెడ్డి ఆశయాలను సాకారం చేయడమే ఆయనకు ఘన నివాళి

– సంస్మరణ సభలో ఎంపీ గురుమూర్తి భావోద్వేగం

తిరుపతి రెవెన్యూ, మేజర్ న్యూస్: గూడూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామిరెడ్డి ఉత్తరక్రియలలో తిరుపతి లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి పాల్గొన్నారు. వరగలి గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి జానకిరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంస్మరణ సభలో ఎంపీ మాట్లాడుతూ జానకిరామిరెడ్డి మరణం వరగలి ప్రాంతానికే కాకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పుడూ అప్రమత్తంగా ఉండి, ప్రతి అంశాన్ని క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేస్తూ అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకుడిగా ఆయనను స్మరించారు. వరగలి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం పూర్తికావడంలో జానకిరామిరెడ్డి గారి పాత్ర కీలకమని, చుట్టుపక్కల గ్రామాల దేవాలయాల పునర్నిర్మాణానికి ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఎంపీ తెలిపారు. కొన్ని దేవాలయాలను ఎండోమెంట్ శాఖలో చేర్చే విషయమై కూడా ఆయన తనతో చర్చించిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. జానకిరామిరెడ్డి చేసిన సేవలను స్మరిస్తూ ఎంపీ భావోద్వేగానికి గురయ్యారు. తమ్మినపట్నం, లింగవరం గ్రామాల రహదారి అభివృద్ధి అంశంపై ఆయన నిరంతరం పట్టుదలతో కృషి చేశారని, లింగవరం పంచాయతీ పరిధిలో సుమారు రెండున్నర కోట్ల రూపాయలతో రోడ్డు పనులను మంజూరు చేసేలా చర్యలు చేపడుతున్నామని ఎంపీ వెల్లడించారు. ప్రజల కోసం నిరంతరం తపించిన ఆత్మీయుడు, సౌమ్యుడు, సేవాభావం కలిగిన నాయకుడిగా జానకిరామిరెడ్డి గారిని స్మరించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సభలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలి

- రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్
- గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ యుగంధర్ పొన్న

పెనుమూరు, మేజర్ న్యూస్: ప్రతి విద్యార్థి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత లక్ష్యంగా ఏకాగ్రతతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని రాష్ట్ర ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్,గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ యుగంధర్ పొన్న ఉన్నారు. బుధవారం పెనుమూరు మండలంలోని ఆరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల లో పదో తరగతి చదువుతున్న 214 మంది విద్యార్థులకు సుమారు 15 వేల రూపాయలు విలువ కలిగిన పరీక్షా సామాగ్రి వితరణగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పెనుమూరు మండలంలో ఆరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు 100 కు 100% ఫలితాలు సాధించి మండలానికి, పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే పరీక్షలు రాసే విద్యార్థులు ఎలా చదివామన్నది ముఖ్యం కాదని ,పరీక్ష ఎంత బాగా రాశామన్నది ముఖ్యమని అన్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులు ఎలాంటి ఆందోళన పడవద్దని ,ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, ఏవైనా సందేహాలు తలెత్తితే ఉపాధ్యాయుల ద్వారా ముందే నివృత్తి చేసుకోవాలని, ప్రశ్నించినప్పుడే లాభం కలుగుతుందని ,ఈ సూత్రాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ పరీక్షా సామాగ్రి లో పరీక్షలు రాసేందుకు ప్యాడు, పెన్ను, స్కేలు, ఏంటి సామాగ్రిని అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయుడు రమేష్ బాబు, జనసేన పార్టీ మహిళా అధ్యక్షురాలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేణుక, జనసేన పార్టీ మండల సీనియర్ నాయకుడు చంద్రబాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి రాఘవ్, త్యాగరాజులు, బాలచంద్ర, రమేష్, చందు పాల్గొన్నారు.

రెండు జాతీయ స్థాయి ఈవెంట్లలో ప్రతిభ చూపిన కుప్పం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి

కుప్పం,మేజర్ న్యూస్: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి భువనేశ్వరన్ రెండు ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి సాంకేతిక కార్యక్రమాల్లో పాల్గొని విశేష ప్రతిభ కనబరిచి కళాశాలకు గౌరవం తీసుకువచ్చారు.ఆయన దేశవ్యాప్తంగా నిర్వహించిన "ఇండియా ఏ ఐ ఇంపాక్ట్ ఎక్స్‌పో 2026"లో పాల్గొని కృత్రిమ మేధస్సు రంగంలో తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా, చెన్నైలోని ఐఐటీఎం రీసెర్చ్ పార్క్‌లో నిర్వహించిన "ది కాటలిస్ట్ 2026 – ఇన్నోవేటివ్ ప్రొడక్ట్ కమర్షియలైజేషన్" కార్యక్రమంలో తన వినూత్న అగ్రి–టెక్ ప్రోటోటైప్ " ఫార్మ్ కాల్ " ను ప్రదర్శించేందుకు ఎంపికయ్యారు. ఫార్మ్ కాల్ ప్రాజెక్ట్ వ్యవసాయ రంగంలో సాంకేతికతను వినియోగించి రైతులకు సమయానుకూల సమాచారం, సలహాలు అందించేందుకు రూపుదిద్దుకున్నది. ఈ వేదికల ద్వారా ఆయన పరిశోధనా దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచనలు మరియు సాంకేతిక నైపుణ్యాన్ని చాటారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా. బి. సి. నాగరాజ్, వైస్ చైర్మన్ డా. ఎన్. సునీల్ రాజ్, ప్రిన్సిపల్ డా. ఎస్. సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డా. ఎస్. బాస్కరన్, విభాగాధిపతి డా. కె. లోగేష్ మరియు అధ్యాపకులు భువనేశ్వరన్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఆవిష్కరణా భావనను పెంపొందించడం, పరిశోధనను ప్రోత్సహించడం కళాశాల లక్ష్యమని యాజమాన్యం పేర్కొంది.ఈ విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని తెలిపారు.

అంత్య క్రియలకు టిడిపి నేత ఆర్థిక సహాయం

కోట, మేజర్‌న్యూస్: మండలంలోని కొత్త పాలెం గ్రామానికి చెందిన ఈదురు కొండయ్య బుధవారం మరణించారు. గూడూరు నియోజకవర్గం శాసన సభ్యులు డా.పాశం సునీల్ కుమార్ సహకారంతో కొత్తపాలెం గ్రామంలో ఈదురు కొండయ్య భౌతికాయానికి టీడీపీ నాయకులు నెల్లూరు మెహన్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈదురు కొండయ్య కుటుంబానికి మట్టి ఖర్చులకు 5 రూపాయలు ఆర్థిక సహాయం అందించిన రైతు విభాగకార్యనిర్వాహక కార్యదర్శి పెన్నా చెరువు ఆయకట్టు నీటి సంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్ రెడ్డి నెల్లూరు మోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో నందు ఎవరికి ఏ సమస్య ఉన్న ఎవరు ఇబ్బంది పడకుండా నేను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు మోహన్ రెడ్డి వెంట టిడిపి సీనియర్ నాయకులు శానంపూడి గోపాల్ రెడ్డి,నేదురుమల్లి కిరణ్ కుమార్ రెడ్డి,మురళి రెడ్డి,పెనుబోలు ప్రభాకర్ రెడ్డి,బూత్ కన్వీనర్ గుండాల సుబ్రహ్మణ్యం, మదన్ , తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులు నివారణపై అవగాహన

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్న్యూస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో లైంగిక వేధింపులు నివారణ పరిష్కారం అనే అంశంపై ఉమెన్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం పురుష అధ్యాపకులు ఉద్యోగులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విసి ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణ మూర్తి, అడ్వకేట్ లోకల్ లీగల్ అడ్వైజర్ అజయ్ కుమార్, వెస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్సై అనిల్ కుమార్, విసి పాల్గొన్నారు .విశ్వవిద్యాలయంలో ప్రతి ఒక్కరి శ్రేయస్సును, అధ్యయన ఉత్కృష్టతను, పెంపొందిస్తూ ముందుకు సాగుతున్నామని విసి తెలియజేశారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి విద్యార్థి పనిచేసే చదువుకునే ప్రదేశంలో ఇతరులతో ఏ విధంగా వ్యవహరించాలి, ఎలాంటి నియమాలు మనం పాటించాలి అనే విషయాన్ని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గౌరవంగా బాధ్యతతో నియమ నిబంధనను అనుసరించి ముందుకు సాగాలన్నారు. అనిల్ కుమార్ శాంతి భద్రతల నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని, చట్టాన్ని అనుసరిస్తూ సమాజంలో అవగాహన కలిగి జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకట నారాయణరావు, అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల, ప్రొ.రంగనాథన్, ఉమెన్ సెల్ చైర్పర్సన్ ప్రొ.ఆర్జే రమాశ్రీ, డా.ఎ.చందులాల్, డా.ఆర్.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ ఆర్ సెట్ ర్యాంక్ కార్డు విడుదల

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ : రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కే మధుమూర్తి, పద్మావతి మహిళా వర్సిటీ విసి ప్రొఫెసర్ వి.ఉమ 2024-25 ఏపీ ఆర్ సెట్ ర్యాంకు కార్డును బుధవారం విడుదల చేశారు. అభ్యర్థుల కోసం పూర్తి వివరాలు ఉన్నత విద్యా మండలి అధికారిక వెబ్ సైట్లో పొందుపరిచినట్లు ఆర్ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ ఆర్ ఉష, ప్రొఫెసర్ జాన్ సుష్మ తెలిపారు. ర్యాంకు కార్డు పూర్తి వివరాలకు వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించారు.

నాడు-నేడు నిధులు దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేపట్టాలి

- శ్రీహరిపురం గ్రామస్తుల డిమాండ్

విజయపురం, మేజర్ న్యూస్ : మండల పరిధిలోని శ్రీహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులకు అప్పటి ప్రభుత్వంలో నాడు నేడు క్రింద ప్రభుత్వం కోటి 33 లక్షల 74 వేల 35 రూపాయలు మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాల అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంది. కానీ పూర్తిస్థాయిలో నిధులు ఖర్చు చేసి పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సంబంధిత అధికారులు, ప్రధానోపాధ్యాయుడు తుంగలో తొక్కారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు 82 లక్షల 82వేల 991 రూపాయలు మాత్రం ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారు. ఖర్చు చేసినట్లు చూపుతున్న నిధులలో అధిక మొత్తంలో దుర్వినియోగం చేశారని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు కూడా పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. కావున సంబంధిత ఉన్నతాధికారులు దీనిపై సమగ్ర విచారణ చేపట్టి దుర్వినియోగం చేసిన నిధులను రికవరీ చేసి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

వాకాడు మేజర్ న్యూస్ : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరు మంచి క్రమశిక్షణతోపాటు మంచి అలవాట్లు అలవర్చుకుని తమ బంగారు భవిష్యత్తు కాపాడుకోవాలని వాకాడు ఎస్సై నిఖిల్బాబు విద్యార్థులకు సూసించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మండలంలోని బాలిరెడ్డి పాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో విద్యార్థులతో, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు, చిన్నారులపై నేరాలు, గంజాయి వాడకంపై కల్గే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయికి బానిసై వారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఆయన సూసించారు. సైబర్ నేరగాళ్లు తమ సాంకేతికతను ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్నా క్రమంలో యువతతగు జాగ్రత్తలు పాటించాలన్నారు. బ లికలపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులకు లేదంటే పోలీసులకు సవ మాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక భవిష్యత్తు సురక్షతం చేసుకోవడానికే ఆర్థిక అక్షరాస్యత అవసరం

సత్యవేడు, మేజర్ న్యూస్: దీర్ఘకాలిక ఆర్థిక భవిష్యత్తును సురక్షితం చేసుకోవడానికి ఆర్థిక అక్షరాస్యత అవసరమని తిరుపతి జిల్లా సత్యవేడు స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్య ప్రకాష్ అన్నారు.బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ అభివృద్ధి సంస్థ ఏపిఎం డాంగే యాదవ్ అధ్యక్షతన ఆర్థిక అక్షరాస్యతపై డ్వాక్రా సభ్యులకు,వివో సంఘం లీడర్లకు అవగాహన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా ఎస్బిఐ మేనేజర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఆదాయం ఖర్చులను ట్రాక్ చేయడంతో పాటు ఆర్థిక ప్రణాళికలను రూపొందించుకోవడంలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించుకోవాలన్నారు. పైగా ప్రతి ఖాతాదారులు కొంత సొమ్మును వారి వ్యక్తిగత ఖాతాలో పొదుపు చేసుకోవాలన్నారు. దీంతోపాటు వడ్డీ వ్యాపారుల ఉచ్చులో పడకుండా బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.విట్స్ కౌన్సిలర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ సైబర్ మోసాలు చోటు చేసుకున్న గంటలోపే 1930 నెంబర్కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే ఖాతాలో మాయమైన నగదు విదేశాల ఖాతాలోకి వెళ్లకుండా చూడొచ్చు అన్నారు. బాలికల భవిష్యత్తును దుష్ట ఉంచుకొని సుకన్య సమృద్ధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ అవగాహన సదస్సులో స్థానిక డిసిసి బ్యాంక్ మేనేజర్ కార్తీక్,గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ అధికారి సుమన్,వెలుగు సీసీలు శివకుమార్, పురుషోత్తం,విట్స్ కౌన్సిలర్లు లక్ష్మణ్ కుమార్, రామకృష్ణ,పలువురు డ్వాక్రా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో డిజిటల్ పరీక్ష కేంద్రం ప్రారంభం

- పరీక్షా వ్యవస్థను ఆధునీకరించడంలో ఒక మైలురాయి

- డిజిటలైజేషన్ తో విద్యార్థులకు వేగమైన సేవలు అందిస్తాం : విసి టాటా నర్సింగరావు

తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్న్యూస్: ఎస్వీయూ పరిపాలన భవనంలోని పరీక్షల విభాగంలో డిజిటల్ పరీక్ష ప్రక్రియ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య టాటా నర్సింగరావు హాజరై రెక్టార్ ఆచార్య సిహెచ్. అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.భూపతి నాయుడుతో కలసి డిజిటల్ పరీక్ష ప్రక్రియ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ డిజిటల్ పరీక్షా ప్రక్రియ కేంద్రం ఏర్పాటు విశ్వవిద్యాలయం పరీక్షా వ్యవస్థను ఆధునీకరించడంలో ఒక ప్రధాన మైలురాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కేంద్రం మొత్తం పరీక్షా ప్రక్రియను క్రమంగా ఎండ్-టు-ఎండ్ డిజిటల్ మోడ్లో నిర్వహిస్తుందని, ఎక్కువ వేగం, పారదర్శకత, సామర్థ్యం, ఖచ్చితత్వాన్ని నిర్ధారిస్తుందని ఆయన చెప్పారు. డిజిటలైజేషన్ మాన్యువల్ జోక్యాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, లోపాలను తగ్గిస్తుందని, విద్యార్థులకు వేగవంతమైన సేవలను అందిస్తుందని, తద్వారా విద్యా పరిపాలనను బలోపేతం చేస్తుందని వ్యాఖ్యానించారు. డిజిటల్ కేంద్రాన్ని స్థాపించడంలో పరీక్షల విభాగం చేసిన కృషిని అభినందించారు. పరీక్షల డీన్ ఆచార్య సురేంద్ర బాబు, పరీక్షల కంట్రోలర్ డాక్టర్ బి. రాజమాణిక్యం డిజిటల్ పరీక్షా ప్రక్రియ కేంద్రం లక్ష్యాలు, కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. ఈ వ్యవస్థ వర్క్ఫ్లోలను క్రమబద్ధీకరిస్తుందని, రియల్-టైమ్ పర్యవేక్షణను ప్రారంభిస్తుందని, విద్యార్థుల, అనుబంధ కళాశాలలకు సేవా బట్వాడాను మెరుగుపరుస్తుందన్నారు. ఈ డిజిటల్ పరీక్ష కేంద్రాన్నిటాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సాంకేతిక సహకారంతో అమలు అమలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఇంజనీర్ తాండవ కృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లు, సూపర్డెంట్లు, పరీక్ష శాఖ, ఇంజనీరింగ్ సిబ్బంది, టిసిఎస్ బృందం పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

బి ఎన్ కండ్రిగ, మేజర్న్యూస్: శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రాకవర్త్ పరిశ్రమ వితరణతో ఇరుగుళం, మాదనపాళెం, అరవపాలెం జడ్పీ హైస్కూళ్ల పదవ తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షా సామగ్రి పంపిణి చేశారు.మార్చి 16 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, పరీక్షలు వ్రాయడం కోసం ఒక్కో విద్యార్థికి ఒక రైటింగ్ ప్యాడ్, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్స్ చొప్పున మొత్తం 130 మంది విద్యార్థులకు మెటీరియల్ అందచేశారు. ఆయా స్కూళ్ల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో రాకవర్త్ ప్లాంట్ హెడ్ శ్రీరామ్, కంపెనీ సిబ్బంది చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు.రాకవర్త్ చొరవను అభినందించిన శ్రీసిటీ డైరెక్టర్ (సీఎస్సార్) నిరీషా సన్నారెడ్డి, శ్రీసిటీ ప్రాంత ప్రభుత్వ పాఠశాలలలో చదివే ప్రతి విద్యార్థికి అన్ని రకాల విద్యావసతులు అందాలన్న లక్ష్యంతో స్థానిక పరిశ్రమల భాగస్వామ్యంతో తాము పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ సహకారం నిరంతరంగా కొనసాగుతుందన్నారు.

కార్యకర్తలకు అండగా నిలిచే పార్టీ.."జనసేన"

-జనసేన తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్

తిరుపతి సిటీ,మేజర్ న్యూస్: కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే పార్టీ.."జనసేన" అని,అలాంటి పార్టీ అధినేత,రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని కార్యకర్తలు ఒక్క ఉద్యమంగా భావించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ కిరణ్ రాయల్ స్పష్టం చేశారు.జనసేన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన "ఉద్యమి" సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా తిరుపతిలో గురువారం నుండి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీనికి సంబంధించిన పోస్టర్ను బుధవారం జన సైనికులతో కలిసి కిరణ్ రాయల్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 16 లక్షల మంది తమ పార్టీ సభ్యత్వం తీసుకోవడం జరిగిందని,ేంపటి నుంచి జనసేన సభ్యత్వం పండుగ వాతావరణంలో జరుగుతుందని అన్నారు.కాపులపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి నిజంగా అంత ప్రేమ ఉంటే ఆ పార్టీ అధ్యక్షుడిగా అంబటి రాంబాబును నియమించాలని, అదేవిధంగా వైసీపీ తరపున సీఎం అభ్యర్థిగా అయినా ప్రకటించాలంటూ సవాల్ విసిరారు. కాపుల్లో కుంపటి రాజేసి జగన్ రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. తిరుమల కల్తీ నెయ్యి విషయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అసెంబ్లీలో స్పష్టంగా మాట్లాడటం జరిగిందన్నారు. ఆయన మాటలను, మనోవేదనను రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకున్నారని తెలిపారు. సమావేశంలో హేమ కుమార్, సాయి దేవ్,కిషోర్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోండి

రామచంద్రపురం, మేజర్న్యూస్: ఉప్పుల వంక గ్రామస్తుల వేడుకలు అనుపల్లి పంచాయతీ ఉప్పులంక సమీపంలో ని దద్దనాల బండ పై వాటర్ షెడ్ పథకంలో ప్రభుత్వ ఏర్పాటు చేసిన కల్లాం ధ్వంసం చేసిన అనుపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఉప్పుల వంక గ్రామస్తులు డిమాండ్ చేశారు . బుధవారం ఇంచార్జ్ఎంపీడీవోకు, తాసిల్దార్ మధుసూదన్ రావుని కలిసి వినతిపత్రం అందజేశారు .ప్రభుత్వం ఏర్పాటు చేసిన కల్లాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహారెడ్డి పై క్రిమినల్ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో కళ్ళం ధ్వంసం విషయం మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసిన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతి స్థాయి అధికారులు జోక్యం చేసుకుని కల్లాం తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణమే లక్ష్యం

- పిఎంకె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు

రామకుప్పం, మేజర్న్యూస్: మండల పరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో "స్వచ్ఛ రథం" వాహనాలను పీకే ఎం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చే లక్ష్యంతో "స్వచ్ఛరథం" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామాలకు స్వచ్ఛరథం వాహనం వచ్చిన సమయంలో ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను అందజేస్తే, వాటి బదులుగా కూరగాయలు, వంట సరుకులు అందజేయడం ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందిస్తున్నామని చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాల నిర్మాణం సాధిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండలంలోని పంద్యాలమడుగు నుండి పల్లికుప్పం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణంతో గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మెరుగుపడి ప్రజలకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమి సభ్యత్వ నమోదు సమావేశంలో పాల్గొననున్న రాష్ట్ర నాయకులు

పుంగనూరు, మేజర్ న్యూస్ : పట్టణంలోని ట్రావెల్స్ బంగ్లాలో గురువారం సాయంత్రం నిర్వహించనున్న ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం పై సమావేశంలో రాజంపేట పార్లమెంట్ ఇంచార్జ్ , జనసేన పార్టీ ప్రోగ్రాం కమిటీ చైర్మన్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శ్రీనివాస్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, రాజంపేట పార్లమెంట్ పరిశీలకులు అధికారి కృష్ణ పాల్గొంటారని ఉమ్మడి చిత్తూరు జిల్లాప్రోగ్రాం కమిటీ సెక్రెటరీ చైతన్య రాయల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ మండల అధ్యక్షులు, సాధక్ కమిటీ మెంబర్లు, మండల కమిటీ మెంబర్లు , నామినేటెడ్ పోస్ట్ కలిగిన వారు, జిల్లా కార్యవర్గం సభ్యులు నాయకులు హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు.

ప్రసన్న వేంకటేశ్వర స్వామికి వైభవంగా పుష్పయాగం

శ్రీకాళహస్తి మేజర్న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ దేవాలయశీ శ్రీకాళహస్తి మండలంతొండమన్‌పురంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా బుధవారం స్వామి అమ్మవార్లకు పుష్ప యాగం నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు గ్రామస్తులు వివిధ రకాల పుష్పాలను సాంప్రదాయ బద్ధంగా ఆలయానికి తీసుకొచ్చారు. పుష్పపాన్పుపై స్వామి అమ్మ వార్ల ఉత్సవమూర్తులను చేర్చి అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొని పుష్పయాగాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో సూపర్నెంట్ జ్ఞాన శేఖర్ మహేష్ సీనియర్ అసిస్టెంట్ మహేష్, ఇన్స్పెక్టర్ సుధీర్, గ్రామ పెద్దలు దామోదర్ రెడ్డి, కందాటి శేఖర్ రెడ్డి, సంజీవయ్య, విజయ్ కుమార్, మాధవరెడ్డి, చెంగా రెడ్డి పాల్గొన్నారు.

4న శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం హుండీల ఆదాయం లెక్కింపు... ఈఓ బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, మేజర్న్యూస్: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి వార్లు హుండీలు లెక్కింపు 04/03/2026 బుధవారం 7 గంటలకు జరుగుతుందని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఈవో టి బాపిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 500 రాహు కేతు మండపం వెనక ఉన్న పాత మండపం మందు కొట్టు మండపంలో జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా దేవాదాయ శాఖ అధికారి, ఆలయ కార్య నిర్వాహణాధికారి సమక్షంలో జరుగుతుందని తెలిపారు.

జిల్లాలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా పి-4 అమలు

చిత్తూరు కలెక్టరేట్ మేజర్న్యూస్: జిల్లాలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వ ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళుతున్నామని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్లానింగ్ పీయుష్ కుమార్‌కు వివరించారు. బుధవారం అమరావతి నుండి పీ-4 అమలపై కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు బుధవారం స్థానిక కలెక్టరేట్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా ఆర్థిక వృద్ధికి ప్రధాన ఆధారంగా పశు పోషణ రంగం ఉందని, జిల్లాలో రోజుకు సుమారు 20లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. రైతులకు రుణ సదుపాయాలు పెంపొందించడం, ప్రభుత్వ సహకారాన్ని మరింత విస్తరించడం ద్వారా జీడీపీ వృద్ధిని సాధించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జిల్లాలో తయారీ రంగ వాటా కేవలం 20శాతమే ఉండటంతో పరిశ్రమల స్థాపన అత్యవసరమని స్పష్టం చేశారు. ఉపాధి అవకాశాలు పెంచేందుకు కొత్త పరిశ్రమలను ఆకర్షించాల్సిన అవసరం ఉందని, ఉపాధి కొరత కారణంగా బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వలసలు పెరుగుతున్నాయని తెలిపారు, కుప్పం, పుట్టపర్తి, చిత్తూరు, నగరి నియోజకవర్గాలలో పరిశ్రమల ఏర్పాటు దిశగా తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి, శ్రీనివాసులు జిల్లా పంచాయతీ అధికారి, సుధాకర్ డిఆర్డిఏ పిడి శ్రీదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మార్చిలో శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగనున్న విశేష ఉత్సవాలు

తిరుపతి బ్యూరో, మేజర్న్యూస్: మార్చి 3న చంద్రగ్రహణం సందర్భంగా ఉదయం 9 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు ఆలయం మూత. మార్చి 14న ఉత్తరాషాడ నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6.45 గంటలకు ఆలయ మాడ వీధులలో గజ వాహనంపై అమ్మవారు విహరించి భక్తులను కటాక్షించనున్నారు. మార్చి 6, 13, 20, 27 తేదీలలో శుక్రవారం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. మార్చి 19న ఉగాది సందర్భంగా సాయంత్రం 6 గంటలకు అమ్మవారు పుష్ప పల్లకీపై ఆలయ మాడ వీధులలో విహరించి భక్తులను కటాక్షించనున్నారు. అనంతరం రాత్రి 8 గంటలకు పంచాంగ శ్రవణం, ఆస్థానం నిర్వహించనున్నారు.

శ్రీ బలరామకృష్ణ స్వామి ఆలయంలో... మార్చి 24న రోహిణి నక్షత్రం సందర్భంగా శ్రీ కృష్ణ స్వామివారికి రాత్రి 7 గంటలకు తిరుచ్చి ఉత్సవం జరుగనుంది.

శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో... మార్చి 6న హస్త నక్షత్రం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామివారికి సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు.

శ్రీ శ్రీనివాస స్వామి ఆలయంలో... మార్చి 19న సాయంత్రం 05 గంటలకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం. మార్చి 7, 14, 21, 28 తేదీలలో శ్రీనివాస స్వామి మూలవర్లకు ఉదయం 8 గంటలకు అభిషేకం.

అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో... మార్చి 3న చంద్రగ్రహణం కారణంగా ఉదయం 9 నుండి రాత్రి 8 గంటల వరకు ఆలయం మూత, అష్టదళ పాదపద్మారాధన సేవ రద్దు. మార్చి 19న ఉగాది సందర్భంగా ఉదయం 8 గంటలకు తిరువీధి ఉత్సవం, ఉదయం 9 గంటలకు ఉగాది ఆస్థానం, ఉదయం 10 గంటలకు పంచాంగ శ్రవణం. మార్చి 6, 13, 20, 27వ తేదీలలో శుక్రవారం సందర్భంగా ఉదయం 7 గంటలకు వస్త్రాలంకారణ సేవ, అభిషేకం. మార్చి 11న ఉదయం 8 గంటలకు అష్టోత్తరశత కలశాభిషేకం. మార్చి 15న శ్రవణా నక్షత్రం సందర్భంగా ఉదయం 10.30. గంటలకు కల్యాణోత్సవం. మార్చి 1, 8, 15, 22, 29వ తేదీలలో శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి వారికి ఉదయం 8.15 గంటలకు అభిషేకం జరుగుతుంది.

ఆర్తులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

చిత్తూరు ప్రతినిధి, మేజర్న్యూస్: ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థులకు అండగా నిలుస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నార్తులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. సుమారు రూ.6లక్షలు విలువ చేసే సీయంఆర్ఎఫ్ చెక్కులను పదిబాధిత కుటుంబాలకు చిత్తూరు ఎంపీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అందజేసి, వారిలో స్థైర్యాన్ని నింపారు.ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని కొనియాడారు. పేదరికం లేని సమాజ స్థాపనే సంకల్పంగా ముందుకు సాగుతున్నారన్నారు. ఇందులో భాగంగానే పలు వ్యాధులతో బాధపడే వారికి, ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదు కుంటూ, వారిలో స్థైర్యాన్ని కోల్పోకుండా ఉండటానికి తగుజాగ్రత్తా చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలియజేశారు.

అన్న క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలి- కమిషనర్

తిరుపతి బ్యూరో, మేజర్న్యూస్: తిరుపతి నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించాలని, ఎటువంటి లోపాలు ఉన్నా కఠిన చర్యలు తీసుకుంటా మని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సిబ్బం దిని ఆదేశించారు. బుధవారం నగరంలోని స్విమ్స్ కూడలి వద్ద ఉన్న అన్నాక్యాంటీన్‌ను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాధ్యాహ్నం భోజనం చేస్తున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు. అన్నం వృధా చేయకుండా తగినంత తీసుకోవాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్క టోకెన్ మాత్రమే తీసుకోవాలని సూచించారు. వచ్చేవారికి నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని తెలిపారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. స్వచ్ఛమైన త్రాగునీరు అందించా లని తెలిపారు. ప్రజల నుండి ఎటువంటి పిర్యాదులు అందకుండా జాగ్రత్తగా శుభ్రమైన ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు.

జనం కోసమే సూర్య

మీ అభిప్రాయాలే మా కథనాలు
నేటి దినపత్రిక సూర్యకు పాఠకులే మార్గదర్శకులు, ప్రచురితమయ్యే ప్రతి కథనం, రోజువారి వార్తలపై మీ అభిప్రాయాలను మా దృష్టికి తీసుకువస్తే మరింత శ్రద్ధగా మీ అందరి ఆదరణ పొందేలా కృషి చేస్తామని ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాం. మరింత సమాచారం అందించాల్సిన వారు ఎప్పుడైనా మీ అభిప్రాయాలను క్లుప్తంగా తెలియచేయాలని, మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని తెలియచేస్తున్నాం.

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 9346318232
ఎన్.లక్ష్మినారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్ : 6301107116

వైభవంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వారి పరివార దేవతల నూతన విగ్రహ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం

చిట్టమూరు మేజర్‌న్యూస్: మండలంలోని ఉప్పలమర్తి గ్రామంలో శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామివారి పరివార దేవతల నూతన విగ్రహ ప్రతిష్ట,మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాల నడుమ పూజలు,గోపూజ, ప్రత్యేక యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం నీటిని కళాశాలలో ఉంచి యాగ గుండం వద్ద పెట్టి ప్రత్యేక కలిస పూజలు చేశారు.అనంతరం శైవాగమ పండిట్, తత్పురుషదీక్షా శివాచార్యులు,ఆగమ వైభవ రత్న,ఆలయ వాస్తు శేఖర బిరుదాంకితులు,ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆగమ అర్చక పరీక్షాధికారి,ఆలయ నిర్మాణ వాస్తు సిద్ధాంతి బ్రహ్మశ్రీ నూతలపాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.స్వామీజీ, వేద పండితులు కలిస నీటిని మేళ తాళాలు నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆలయ రాజగోపురం పైకి వెళ్లి కలిస నీటిని గోపురంపై నుంచి పోసి ప్రత్యేకంగా కుంభాభిషేకం చేశారు. అనంతరం కలిస నీటిని భక్తులపై చల్లడంతో పాటు ఆలయంలో నూతనంగా ప్రతిష్టించిన స్వామి, అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు,పుష్పాలంకరణలు చేసి, దీపారాధనలు చేపట్టారు.శాంతి కళ్యాణాన్ని నిర్వహించారు.పూజా కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రజల ప్రాణాలపై చెలగాటం

– డయింగ్ యూనిట్ల నుండి రంగునీల్లు బయటకి

నగరి, మేజర్‌న్యూస్: నగరి మున్సిపాలిటీ కమిషనర్‌కి నగరి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న డయింగ్ యూనిట్లు వారు బయటకు వదులుతున్న రసాయనాల విషపు నీరు పైన సిపిఐ నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కొద్ది కొద్దిగా డయింగ్ యూనిట్ల వారు రసాయనాల కలుషిత నీరును కాలువల ద్వారా కుసస్థలి నదిలోకి మరియు చుట్టుపక్కల ఉన్న చెరువులు గుంటలోకి బదులుతూయున్నారు కానీ ఇప్పుడు తమిళనాడు నుంచి వచ్చి ఇక్కడున్న డైయింగ్ యూనిట్లను అద్దెకి తీసుకొని పెద్ద ఎత్తున యూనిట్లు నడుపుతున్నారు ఇప్పుడు వృధా నీరు ఎక్కువగా కుశస్థలి నదిలో మరియు చెరువు గుంటలోకి పోయే కాలంలో వాగై పారుతుంది నగరి చుట్టుపక్కల ఉన్న నీరు దీని ప్రభావం వల్ల కలుషితమైంది ఎక్కడ బోర్ వేసిన కలుషిత నీరు వస్తున్నది దీనివల్ల నగిరి ప్రాంతంలో ఉన్న ప్రజలు పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారు చాలామందికి కిడ్నీ లివరు చర్మ వ్యాధులు బోదకాలు గుండె జబ్బు ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు దీనిపైన నగరి మున్సిపల్ కమిషనర్ స్పందించి ఈటీవీ ప్లాంట్ లేని డైయింగ్ ల మీద మరియు ఈటీవీ ప్లాంట్ ఉండి ఉపయోగించకుండా ఉన్న డైయింగ్ ల మీద చర్యలు తీసుకోవాలని కోరడమైనది ఇది ఇలాగే కొనసాగితే నగరి ప్రజలని కలుపుకొని ఈ కలుషిత నీర సమస్యపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలియపరుచున్నాను.

పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

గూడూరు, మేజర్‌న్యూస్: గూడూరు మండల పరిధిలోని కొండ గుంట, అయ్యవారి పాలెం పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. బుధవారం ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంఇణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని, విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరు బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన వారికి తమ సంస్థ ద్వారా బహుమతులు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి దాతగా వ్యవహరించిన ఎగ్గిరెడ్డి విజయ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ అధ్యక్షులు చంద్రశేఖర్, హెచ్ఎం కోటేశ్వర రావు, వాకాటి రామ్మోహన్, పయ్యావుల మురళి నాయుడు, విఎంసి వెంకటేశ్వర రావు, శ్యామ్, వెంకట రావు, డిష్ నాగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలా మోహన్ రెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూలును సందర్శించిన కలెక్టర్

బైరెడ్డిపల్లి మేజర్‌న్యూస్: ముడలం లోని కమ్మనపల్లి ఏపీ రెసిడెన్సియల్ గురుకుల బాలికలపాఠశాలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా భోజనశాల మరమ్మత్తుల కోసం రూ.7 లక్షలు కేటాయించగా బుధవారం కలెక్టర్ మరమ్మత్తు పనులను పరిశీలించి, అనంతరం అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో భోజనం అందేలా మరమ్మత్తులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. వంటశాల, భోజన మందిరం, నీటి సౌకర్యాలు, పరిశుభ్రత ప్రమాణాలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు కేవలం విద్య మాత్రమే కాకుండా ఆరోగ్యం, పోషకాహారం, నివాస వసతులు కూడా అత్యంత ముఖ్యమని తెలిపారు. అందుకే ప్రభుత్వం భోజనశాలల అభివృద్ధికి నిధులు కేటాయించి, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.అదేవిధంగా, పాఠశాలలో కొనసాగుతున్న ఇతర అభివృద్ధి పనులపై కూడా సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అన్ని పనులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ చేపట్టాలని తెలిపారు. లక్ష్మీ ప్రసాద్

చారిట బుల్ ట్రస్ట్, బెంగళూరు వారి సహకారంతో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నూతన భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ట్రస్ట్ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన భవన నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రి నాణ్యత, భద్రతా ప్రమాణాలు, పనుల వేగం తదితర అంశాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ భవనం పూర్తయితే గ్రామీణ ప్రాంత బాలికలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన విద్యావాతావరణం లభిస్తుందన్నారు.భవన నిర్మాణ పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో నిర్వహణ సులభంగా ఉండేలా పనులు చేయాలని, అవసరమైన సదుపాయాలన్నీ ముందుగానే ప్రణాళికాబద్ధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ ఇ పంచాయతీరాజ్ విద్యాసాగర్, కళాశాల ప్రిన్సిపాల్ సత్య సుప్రజ, కళాశాల కమిటీ చైర్మన్ మధుసూదన, లక్ష్మి ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బాలు స్థానిక ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, పాఠశాల నిర్వాహకులు, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం

– ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి

చిత్తూరు ప్రతినిధి, మేజర్ న్యూస్: చలో విజయవాడ కార్యక్రమం బుధవారం అలంకార్ సెంటర్ లోని ధర్నా కేంద్రం వద్ద ఎస్ టి యు రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు దశల వారి పోరాటంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన వేలాదిమంది ఎస్టియు కార్యకర్తలు, మహిళ కార్యకర్తలు చే పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందని,, ఈ కార్యక్రమంలో ఎస్టియు చిత్తూరు జిల్లా శాఖ నుండి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు, మహిళా ఉపాధ్యాయులు, ఎస్ టి యు కార్యకర్తలు పాల్గొనడం జరిగిందని, ఎస్ టి యు చిత్తూరు జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి షేక్ ఇలియాస్ లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు కోరుతూ ఎస్టియు రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపుమేరకు దశల వారి పోరాటం లో భాగంగా జనవరి 30వ తేదీ అన్ని మండల కేంద్రాల్లో తహసిల్దార్లకు మేనిఫెస్టో హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించామని, రెండవ దశలో పోరాటంలో భాగంగా చిత్తూరు జిల్లా కేంద్రంలో గాంధీ బొమ్మ దగ్గర చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించామని,రాష్ట్ర ప్రభుత్వం నుండి నిర్దిష్టమైన హామీ లభించకపోవడంతో ఫిబ్రవరి 25వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టి విజయవాడ అలంకార్ సెంటర్లో ధర్నా నిర్వహించామని తెలిపారు. ఎస్ టి యు రాష్ట్ర సీనియర్ నాయకులు గంటామోహన్ మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వ మెమో 57 మేరకు 2004 సెప్టెంబర్ కు మునుపు నోటిఫికేషన్ ద్వారా నియమింపబడిన 2003 డిఎస్సి ఉపాధ్యాయులు పోలీసులు ఇతర విభాగాలలో నియమించబడిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని సత్వరం అమలు చేయాలి అని, పెండింగ్ లో ఉన్న నాలుగు డి. ఎ లను వెంటనే మంజూరు చేయాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు సుమారు 35 వేల కోట్ల రూపాయలు కొండలా పేరుకుపోయాయని దశలవారీగా ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవరాజులు రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి యువరాజు లు మాట్లాడుతూ రిటైర్ అయిన ఉద్యోగులకు 2024 ఆగస్టు మాసం నుంచి గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ నగదు చెల్లించడం లేదని, వివిధ అవసరాల నిమిత్తం పొదుపు చేసుకున్న పీ ఎఫ్ , ఏపీ జి ఎల్ ఐ సొమ్ములు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ టి యు నాయకులు, మహిళా కన్వీనర్ రాధాకుమారి సంఘ నాయకులు చంద్రన్, లక్ష్మీపతి, సుబ్రహ్మణ్యం పిళ్ళై, గుణశేఖరన్,జగదీశ్వర్, మధు బాబు, కిషోర్ కుమార్ రెడ్డి, ప్రకాష్, కోదండయ్య, పరంధామ, కోటి, చంద్రశేఖర్, నాగేంద్ర, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ సమావేశం

– 178122 రూ. అవకతవకలు రికవరీ

బైరెడ్డిపల్లి మేజర్‌న్యూస్ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత సంవత్సరం నుండి పనులు పై సోషల్‌ఆడిట్ 21 పంచాయతీలలో డిఆర్పీలు నిర్వహించారు ఇందులో భాగంగా 25 తేదీ బుధవారం ఉన్నతాధికాలాదేశాల మేరకు మండల కేంద్రంలో ని ఎంపీడీవో కార్యాలయంలో పిడి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఇందులో భాగంగా డిఆర్పీలు వారు సేకరించిన సమాచారాన్ని అక్కడ తెలియజేశారు. వాటిని పరిశీలించిన పిడి రవికుమార్ గారు 21 పంచాయతీ నివేదిక విన్న తర్వాత వారు మాట్లాడుతూ రికవరీ 130231 అపరాధ రుసుముగా సిబ్బంది వద్ద నుండి 47,891 మొత్తం 178,122 రూ అవినీతి జరిగినట్లు తెలియజేశారు ఈ అమౌంట్ను త్వరలోనే రికవరీ చేస్తామని ప్రెస్ మీట్ ద్వారా తెలియజేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఏపీ డి రవికుమార్. ఎంపీడీవో ఉపేంద్ర. ఎస్ ఆర్ పి కన్నా రెడ్డి. ఏపీవో హరినాథ్. టి ఏ లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణ పద్ధతులతో నాణ్యమైన ఉత్పత్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్: సమగ్ర సస్య రక్షణ పద్ధతులు చేపట్టడం ద్వారా నాణ్యమైన మామిడి పంట ఉత్పత్తులను పొందచ్చని కోకో కోల ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ డాక్టర్ ఆదిత్య పాండా అన్నారు. రాష్ట్రీయ సేవా సమితి, కోకోకోలా ఫౌండేషన్, న్యూ డిల్లీ సహకారంతో జిల్లాలో మామిడి ఉత్పత్తి పెంచటం ధ్యేయంగా నిర్వహిస్తున్న "ఉన్నతి మాంగో" ప్రాజెక్ట్ పర్యవేక్షణలో భాగంగా బుధవారం ప్రాజెక్ట్‌లో లబ్ధి పొందిన రైతులతో రాస్ సేవా నిలయంలో చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాస్ ప్రధాన కార్యదర్శి డా.యస్. వెంకటరత్నం మాట్లాడుతూ మామిడి రైతుల దిగుబడి మరియు ఆదాయం పెంచే దిశగా సమగ్ర పంట యాజమాన్యంపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, అవసరమైన ఇన్పుట్లు పంపిణీ చేయటం జరిగిందని తెలుపుతూ రైతులు శాస్త్రవేత్తల సలహాల మేరకు మామిడి సాగులో అవసరమైన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన దిగుబడులు పొందాలని తెలిపారు.

తమిళనాడు అరియలూరు కృషి విజ్ఞాన కేంద్రం చైర్మన్ డాక్టర్ నదన సభపతి మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా రాస్ స్వచ్ఛంధ సంస్థ వారు ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలలో వివిధ సామాజికవర్గాల వారికి అందిస్తున్న సేవలను ప్రశ్నించారు. అదేవిధంగా ఆయన రైతులు కృషి విజ్ఞాన కేంద్రం వారు సలహాలు, సూచనలు పాటించి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందాలని తెలిపారు. రాస్--కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డా.శ్రీనివాసులు మాట్లాడుతూ ఉన్నతి మాంగో పథకం ద్వారా రైతులకు జీవసంబంధ ఎరువులు, జీవ సంబంధ పురుగు, తెగులు మందులు, సూక్ష్మ పోషక మిశ్రమాలు పంపిణీ చేయటం ద్వారా విదేశాలకు ఎగుమతి చేయటానికి వీలయ్యే రసాయన అవశేష రహిత మామిడి ఉత్పత్తులు పండించే విధంగా సలహాలు సూచనలు అందిస్తున్నట్లు తెలిపి, ఇప్పటివరకు ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి తెలియచేశారు. తరువాత కెవికె శాస్త్రవేత్తలు సుధాకర్, అనిల్ కుమార్ మాట్లాడుతూ మామిడిలో కాయ ఏర్పడే దశలో ప్రధాన సమస్య అయిన పండు ఈగ నివారణ చర్యల గురించి వివరిస్తూ ఎకరాకు 6 నుండి 8 మిథైల్ యూజీనాల్ ఎర బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, అదేవిధంగా ఫ్రూట్ కవర్ సాంకేతికతను వినియోగించుకోవాలని తెలిపి, రైతులకు అతిథుల చేతుల మీదుగా సూక్ష్మ పోషక మిశ్రమం (ఆర్కా మాంగో స్పెషల్), మల్టీ కే, జీవన ఎరువులు, జీవ సంబంధిత కీటక నాశనిలు, పండు ఈగ బుట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాము కుమార్, రాస్ ప్రాజెక్టు సిబ్బంది సాయి చంద్ర బాబు, నీరజ్, చిన్నగొట్టిగల్లు, రొంపిచర్ల, పులిచెర్ల, యర్రావారిపాలెం, పాకాల, పుత్తూరు, వడమాలపేట, రామచంద్రా పురం మండలాలకు చెందిన 110 మంది రైతులు పాల్గొన్నారు.

సందేహాలను నివృత్తి చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి -ఎంఈఓ

పలమనేరు మేజర్‌న్యూస్: పలమనేరు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురులో జరుగుతున్న విషయాల వారీ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి రాజేంద్ర ప్రసాద్, సందర్శించారు. శిక్షణా కార్యక్రమం నిర్వహణ బోధనా విధానాలు

ఉపాధ్యాయుల పాల్గొనడంవంటి అంశాలను సమీక్షించారు. వారు ఉపాధ్యాయులతో పరస్పర చర్చ నిర్వహించి తరగతి గదిలో విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి ఆధునిక బోధనా పద్ధతులు అనుసరించాలని సూచించారు. ముఖ్యంగా విషయంపైలోతైన అవగాహన కల్పించడం సాంకేతికత వినియోగం పెంపొందించడం విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వడం అవసరమని తెలిపారు. పదో తరగతి ఫలితాలను ఉత్తమంగా సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా పనితీరు తక్కువగా ఉన్న పాఠశాలలను సమీక్షించి ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిని గుర్తించి ప్రత్యేక శిక్షణా తరగతులు పునర్విమర్శ కార్యక్రమాలు నిర్వహించి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న పద్ధతులను తమ పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంలో ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. శిక్షణ కార్యక్రమం సక్రమంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు పి.లీలరాణి, సి.బాలసుందరం, ఉర్దూ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శబజు, ఎం.కొటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి, పెంగరగుంట ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, వనరుల వ్యక్తులు సమగ్ర వనరుల బృంద సభ్యులు ఇతర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీ.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ 2వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో విజయవంతం

పలమనేరు మేజర్‌న్యూస్: తిరుపతిలోని విశ్వం హైస్కూల్‌లో 2వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి అనేక అకాడమీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలమనేరుకు

చెందిన వీ.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నుండి మొత్తం 71 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ,క్రమశిక్షణ అంకితభావాన్ని చాటిచెప్పారు. కాటా (ఫార్మ్) విభాగంలో 18బంగారు పతకాలు, 23 రజత పతకాలు 30 కాంస్య పతకాలు, కుమితే (ఫైట్) విభాగంలో 7 బంగారు పతకాలు, 7 రజత పతకాలు, 11 కాంస్య పతకాలు సాధించారు. ఈ అద్భుత విజయాలతో వీ.కే మార్షల్ ఆర్ట్స్ అకాడమీ, పలమనేరు గర్వంగా ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంది. ఇది అకాడమీకి మాత్రమే కాకుండా పలమనేరు పట్టణానికి కూడా గర్వకారణంగా నిలిచింది.అకాడమీ యాజమాన్యం, కోచ్‌లు నిరంతర సహకారం, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్టపడి సాధించిన విజయం ద్వారా పలమనేరు పేరు ప్రతిష్టలనుపెంచిన విద్యార్థులందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

నేడు ఇయర్లీ ప్యాటర్న్ సప్లిమెంటరీ

తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్: ఎస్వీయూ పరిధిలో ఇయర్లీ ప్యాటర్న్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం వర్సిటీలోని ఆర్ట్స్, సైన్స్ కళాశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు రెండు సెషన్లలో జరగనున్న పరీక్షలకు సుమారు 3వేలమందికి పైగా అభ్యర్థులు హాజరు కానున్నారు. ఇయర్లీ ప్యాటర్న్‌లో సబ్జెక్ట్‌లో తప్పిపోయిన విద్యార్థులు ఒక్కో పరీక్షకు 500 నుంచి 600 మంది పరీక్ష రాయనున్నారు. తొలి రోజు యూజీ ఫస్ట్ ఇయర్, థర్డ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అలాగే సెకండ్ ఇయర్ తప్పిన విద్యార్థులకు శుక్రవారం నుంచి పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు హాల్ టికెట్లు పూర్తి స్థాయిలో జారీ చేశారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి కంటే అర్ధగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజామాణిక్యం, ఎగ్జామినేషన్ డీన్ సురేంద్రబాబు తెలియజేశారు. పరీక్షా కేంద్రాలలో అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. సైన్స్ కళాశాలలో హాల్ టికెట్లు పొందగలరు. ఎస్వీయూలో గురువారం నిర్వహించే ఇయర్లీ ప్యాటర్న్ సప్లిమెంటరీ పరీక్షలుకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్లు పొందని వారు ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ బిఎ, బిఎఓఎల్, బీఎస్సీ యూనివర్సిటీ క్యాంపస్ ప్రకాశం భవన్లో పరీక్ష సమయానికి రెండు గంటల ముందు 7, 9 లోపు హాల్ టికెట్లను తీసుకొని నేరుగా పరీక్షా కేంద్రానికి హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల కోసం ఆశాజ్యోతి కార్యాలయం ప్రారంభం

పలమనేరు మేజర్‌న్యూస్: చిత్తూరు జిల్లా పలమనేరులో గంటా ఊరు గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్, పాతపేట జయప్ప వీధిలో ఆశాజ్యోతి దివ్యాంగుల కార్యాలయాన్ని ప్రారంభించారు. దివ్యాంగులకు తన సొంత సహాయ సహకారాలు అందించడం ఎంతో మనసు తృప్తినిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వస్త్రాలు అందజేశారు. మీ సేవా కార్యక్రమంలో తాను వారి కుటుంబ సభ్యుడిగా, ఒక మనిషిగా ఎల్లప్పుడూ సేవలు అందిస్తానని మురుగన్ హామీ ఇచ్చారు.

కేంద్ర,రాష్ట్ర సర్వీసుల్లో ప్రవేశం కోసం ఉచిత శిక్షణ -డాక్టర్ లక్ష్మయ్య

తిరుపతి సిటీ, మేజర్‌న్యూస్: పేద, వెనుకబడిన వర్గాల యువతను కేంద్ర,రాష్ట్ర సివిల్ సర్వీసుల్లో ప్రవేశించేందుకు ఉచితంగా మూడు సంవత్సరాల పాటు బోర్డింగ్, లాడ్జింగ్ అలాగే ఉచితంగా కోచింగ్‌ను "వెంకటపతి విద్యాదీవెన పథకం ద్వారా అందించినట్లు డాక్టర్ లక్ష్మయ్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ గౌరవ చైర్మన్ డాక్టర్ పివి. లక్ష్మయ్య వెల్లడించారు. బుధవారం స్థానిక ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పారా అసోసియేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ప్రతినిధులు భాగవతుల రవికుమార్, చెన్ను రమేష్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ లక్ష్మయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ తాను డాక్టర్ లక్ష్మయ్య మార్గదర్శకత్వంలో సివిల్స్ పరీక్షలు రాసినట్టు తెలిపారు. లక్ష్మయ్య వ్యక్తిత్వం.. పేదల పట్ల ఉన్నటువంటి మక్కువ అలాగే సమాజ సేవా దృక్పథాన్ని వివరించారు. ఈ ఉచిత కోచింగ్ బాల బాలికలకు కలిపి మొత్తం 200మందికి అందించబడుతుందన్నారు. బాలురకు పల్నాడు జిల్లా, వినుకొండ లోని పిపిఆర్ ఎడ్యుకేషన్ సిటీ నందు, బాలికలకు విజయవాడ,కేతన కొండ లోని సిబిఆర్ ఎడ్యుకేషనల్ సిటీ నందు పరీక్ష నిర్వహిస్తామన్నారు. బాలురకు మార్చి 31వ తేదీ, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 5వ తేదీన, తరగతుల ప్రారంభం ఏప్రిల్ 22 నుంచి, అలాగే బాలికలకు మార్చి 10వ తేదీ దరఖాస్తులకు చివరి తేదీ అని, ప్రవేశ పరీక్ష మార్చి 15వ తేదీ,తరగతులు ప్రారంభమయ్యేది మార్చి 23వ తేదీ నుంచి ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన ఐచిక విషయాన్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించబడుతుందన్నారు. సామాజిక సేవలో ముందుండి పేద యువతను సివిల్స్ సర్వీసుల్లో ప్రవేశింప చేయడానికి కృషి చేస్తున్న సిబిఆర్ ప్రసాద్ అలాగే డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ ను ఆయన అభినందించారు. కార్పొరేట్ కోచింగ్ సెంటర్లలో చీరలేని పేద సివిల్ సర్వీసెస్ అభ్యర్థులు ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. నమోదు చేసుకోవడానికి 7842054669 నెంబర్ కు మెసేజ్ చేయాలన్నారు. మూడు సంవత్సరాల సమగ్ర శిక్షణతో కేంద్ర రాష్ట్ర సివిల్ సర్వీసులో ప్రవేశించేందుకు ఇది ఒక అద్భుతమైన అవకాశం అన్నారు.

అన్నదాతకు స్టాటర్ కేబుల్ కష్టాలు

వికృతమాల పరిసరాల్లో దొంగల బీభత్సం..

ఏర్పేడు మేజర్ న్యూస్

ఏర్పేడు మండలం ఇక్కుర్తుమాల పరిసర ప్రాంతాలలో స్టార్టర్, కేబుల్ దొంగలు రోజురోజుకి పెట్రేగి పోతున్నారు. రైతులు పండించిన పంటలు చేతికొచ్చే సమయంలో అండగా ఉండాల్సిన మోటార్లు మూగబోయాయి. వికృతమాల గ్రామంలోని చెళ్లూరు – పాప నాయుడు పేట బండి బాట పరిసర పొలాల్లో దొంగల ముఠా రెచ్చిపోయింది. ఒకే రాత్రిలో సుమారు 30 కి పైగా స్టార్టర్లు, వందల మీటర్ల కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లి రైతులను కోలుకోలేని దెబ్బ తీశారు.

ఘటన వివరాలు గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నా, ఈ స్థాయిలో భారీ చోరీ జరగడం ఇదే మొదటిసారి. రైతులు ఉదయాన్నే పొలాలకు వెళ్లి చూసేసరికి స్టార్టర్ బాక్సులు పగులగొట్టి ఉండటం, భూమిలో అమర్చిన కేబుల్ వైర్లు కత్తిరించి ఉండటంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు.

రైతుల ఆవేదన: పంట కోత దశకు చేరుకున్న తరుణంలో ఈ దొంగతనం జరగడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి భారం : ఇప్పటికే అప్పులు చేసి పంటలు సాగు చేస్తుంటే, ఇప్పుడు మళ్లీ కొత్త స్టార్టర్లు, కేబుళ్లు కొనాలంటే వేల రూపాయల అదనపు భారం పడుతుందని రైతులు వాపోతున్నారు.

పంటకు ముప్పు: మోటార్లు పని చేయకపోవడంతో పొలాలకు నీరు అందక పంట ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యల పరిష్కారం

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

పెళ్ళకూరు మేజర్ న్యూస్ : విద్యుత్ అదాలత్‌ల ద్వారా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని చైర్ పర్సన్ రిటైర్డ్ న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి అన్నారు.బుధవారం మండలంలోని పెళ్లకూరు విద్యుత్ సబ్ స్టేషన్ నందు విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు.వినియోగదారులతో మర్యాదగా మెలగాలన్నారు. వినియోగదారులు కూడా అధికారులపై నిరాధారమైన ఆరోపణలు చేయరాదన్నారు. నిరాధార ఆరోపణలు అని తేలితే ఫిర్యాదుదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల సమమయంలో తనిఖీ అధికారులు ఇష్టానుసారం కేసులు రాయకుండా నిబంధనల మేరకే వ్యవహరించాలన్నారు.బుధవారం జరిగిన విద్యుత్ ఆధాలాత్ లో 7 అర్జీలు రావడం జరిగిందన్నారు.వచ్చిన ఫిర్యాదులను త్వరగతిన అధికారులు చర్యలు తీసుకొని పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు మధు కుమార్,సాంకేతిక సభ్యులు శ్రీనివాస బాబు, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి నాయుడుపేట డివిజన్ విద్యుత్ ఏడి వరప్రసాద్ రెడ్డి, నాయుడుపేట డివిజన్ విద్యుత్ ఈఈ వై.శ్రీనివాసులు,మండల విద్యుత్ శాఖ అధికారి ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష కిట్స్ పంపిణీ

ఏర్పేడు, మేజర్‌న్యూస్ ఏర్పేడు మండలం పాపానాయుడుపేట జిల్లా పరిషత్ హైస్కూల్ లో రత్నాకరం మిత్రబృందం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు 77 మందికి ఉచితంగా పరీక్షకు అవసరం ఐన ప్యాడ్, పెన్నులు, పెన్సిల్స్ ఉన్న కిట్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏర్పేడు మండలం తెలుగు యువత అధ్యక్షులు పూల హేమాక్షి మాట్లాడుతూ పిల్లలు చక్కగా చదువుకొని పదో తరగతిలో మంచి మార్కులు తెచ్చుకొని కన్న తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలకు, విద్య నేర్పిన ఉపాధ్యాయులకు కూడా మంచి పేరు తీసుకు వచ్చి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలు కోగంటి లక్ష్మి చైతన్య, దేదీవ్య, యర్రు నవీన్లను అభినందించారు. ఈ కార్యక్రమంలో వికృతమాల సంతాన సంపద వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు రత్నాకరం రాము స్వామి , కృష్ణ స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జిమ్ చేసి వామిట్ చేసుకున్న యువకుడు..

టెంకాయ నీళ్ళు తాగిన వెంటనే మృతి

జిమ్ వద్ద కుటుంబీకులు ఆందోళన వ్యక్తం... ఎంట్రీ ఇచ్చిన పోలీసులు
కార్డియాక్ అరెస్టుతో మృతి చెందాడని..ఆసుపత్రి సూపరిండెంట్ మమతారాణి వివరణ
మృతుడికి హెవీ వెయిట్ ఇవ్వలేదు... తమకు 14 ఏళ్లు ఎక్స్పీరియన్స్ ఉందంటున్న నిర్వాహకుడు

పలమనేరు మేజర్ న్యూస్ పట్టణం గుడియాత్తం రోడ్డులోని 'వర్క్ అవుట్ జోన్' జిమ్ లో జిమ్ ముగించుకుని విశ్వనాథ్ అనే 27 ఏళ్ల యువకుడు బయటకు వచ్చి వాంతి చేసుకున్నాడు. తర్వాత అతని స్నేహితుని సహాయంతో ద్విచక్ర వాహనంలో సమీపంలో ఉన్న టెంకాయల దుకాణం వద్ద టెంకాయి తాగి సొమ్మసిల్లి కింద పడిపోయాడు, స్థానికుల సహాయంతో హుటాహుటిన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి విశ్వనాథ్ ను తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో తీవ్ర కోపోద్రిక్తులైన కుటుంబీకులు, జిమ్ వద్ద ఆందోళనకు దిగారు, మీ జిమ్ వల్లే విశ్వనాథ్ చనిపోయాడని ఆరోపిస్తూ జిమ్ నిర్వాహకులతో వాగ్వాదం పెట్టుకొని ఆందోళనకు దిగారు. మృతుడు విశ్వనాథ్ బంధువులు మాట్లాడుతూ, ఎలాంటి అనుభవం లేని వ్యక్తులు జిమ్ నిర్వహిస్తూ మా బిడ్డ మృతికి కారణమయ్యారు, ఫీజులు వసూలు చేసేటప్పుడు తగినంత ట్రైనింగ్ ఇవ్వలేదని ఎవరో పిస్టు విశ్వనాథ్ మృతికి కారణమైన జిమ్ యాజమాన్యంపై చర్య తీసుకోవాల్సిందిగా కోరారు. వర్కౌట్ జిమ్ ప్రాంతానికి చేరుకున్న సీఐ మోహన్ రెడ్డి ఇరు వర్గాలను శాంతింపజేసి, సీసీ ఫుటేజ్ పరీక్షించి విశ్వనాథ్ మృతికి కారణమైన విషయాలను విశ్లేషిస్తామన్నారు. ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ మమతా రాణి మాట్లాడుతూ, 27 ఏళ్ల విశ్వనాథ్ జిమ్ చేస్తూ కుప్ప కులాడని ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది, వైద్యులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. నిండా 30 ఏళ్లు కూడా లేని యువకుడు జిమ్ చేస్తూ చనిపోవడం అత్యంత బాధాకరం అంటూ జిమ్ ఎలాంటి వారు చేయాలి ఫిట్నెస్ ట్రైనర్ దగ్గర ఉంటే చేస్తే మంచిదని పలు సూచనలు చేశారు. జిమ్ నిర్వాహకుడు నవీన్ మాట్లాడుతూ, విశ్వనాథ్ అనే యువకుడు తమ జిమ్ నందు రెండు వారాలుగా జిమ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు, అతనికి మొదట మేము హెవీ వెయిట్ ఇవ్వలేదు, తమకు 14 ఏళ్లుగా జిమ్ నిర్వహణ అనుభవం ఉంది ఇప్పటివరకు ఇలాంటి ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. కాగా మరిన్ని వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సిఉంది.

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన

తిరుపతి బ్యూరో,మేజర్ న్యూస్ : జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అధికారులు పాఠశాల /స్కూల్లను సందర్శించి విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, ముఖ్యంగా పోక్సో కేసులు పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. బాలలపై లైంగిక దాడులు, వేధింపులపై ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన చట్టపరమైన చర్యలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై వివరించి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా నిర్మించుకోవాలంటే విద్యే ప్రధాన ఆయుధమని, క్రమశిక్షణతో చదువుకొని మంచి పౌరులుగా ఎదగాలని ప్రేరణనిచ్చారు. ముఖ్యంగా బాలికలకు "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" గురించి స్పష్టంగా వివరించి, ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా లేదా వేధించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ధైర్యం కల్పించారు. జిల్లా పోలీస్ శాఖ విద్యార్థుల భద్రత.పట్ల ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, సమాజంలో నేరాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు.